రైళ్లు భారతీయ ఆర్థికవ్యవస్థకు జీవనాడి లాంటిది.ప్రతి సంవత్సరం ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా అదే సంఖ్యలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు పెరగడం లేదు. ప్రతిరోజూ లక్షలాదిప్రయాణికులు తమ ప్రాణాలుచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రద్దీ సమయాలలో లిఫ్ట్, ఎక్స్‌లేటర్లు పనిచేయకపోవడం నిత్యకృత్యం. సామాన్య ప్రజలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ రిజర్వ్‌డ్ బోగీలసంఖ్య తక్కువగా ఉండటంవలన స్లీపర్‌కోచ్‌లలో సామాన్య ప్రయాణికులు ఎక్కడంతో ఎక్కువ ధరచెల్లించి రిజర్వ్ టికెట్ తీసుకున్నవారు అసౌకర్యం గా ప్రయాణం చేస్తున్నారు. బోగీలలో కెపాసిటీకిమించిన ప్రయాణికులుఉండటం మూలాన టాయిలెట్ ఉపయోగం ఎక్కువ. నీటి కొరత కారణంగా వాటిని ఉపయోగించుకోలేకపోతున్నారు. రైల్వేలు ప్రజల సొమ్ముతో నిర్మించబడ్డవి. అందుబాటు ధరల్లో సౌకర్యాలు కల్పించాలి.

-ఆళవాందర్ వేణుమాధవ్, హైదరాబాద్

### పొంచి ఉన్న ప్రమాదం

భారత్‌కు ప్రమాదం పొంచి ఉంది నిజమే. విదేశాంగ విధానం పరంగా గ్లోబల్ సౌత్ లీడర్‌గా ఎదగాలి అనుకుంటున్న భారత్‌కు మాలదీవులు, మయన్మార్, చైనా, పాకిస్థాన్ నుండి సవాల్ ఎదురుకాబోతోంది బంగ్లాదేశ్‌లో కూడా త్వరలో ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో షేక్ హసీనా ఒకవేళ అధికారంలోకి రాకపోతే అది కూడా ఇండియాకు వ్యతిరేకంగా వెళ్లే ప్రమాదం ఉంది.చైనా విసిరిన వన్‌బెల్ట్ వన్ రోడ్ వలలో చాలా చిన్న దేశాలు చిక్కుకొని ఇవ్వాళ అభివృద్ధి సాకుతోచైనా అప్పుల ఊబిలో చిక్కుకొని విలవిలలాడుతున్నాయి. దానికి పాకిస్థాన్ శ్రీలంక సజీవ ఉదాహరణలుగా ఉన్నాయి. అయితే ఇప్పుడు భారత్ చేయవలసింది ఏమిటి? గ్లోబల్ సౌత్‌లోని అన్ని దేశాలను కలుపుకొనిపోవడమే కాదు.

-భారత అవినాష్, జనగామ

### ఆరు గ్యారంటీల అమలుపై ఆసక్తి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరింది. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్‌ఇచ్చిన ఆరుగ్యారంటీ పథకాల అమలుపై ఇప్పుడు ఆసక్తి మొదలైంది. మహిళలు, రైతులు, యువత, ఆరు గ్యారంటీ పథకాలను పూర్తిగా నమ్మి కాంగ్రెస్ వెంట నిలిచారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్‌రెడ్డి కూడా ఆరు గ్యారంటీ పథకాల అమలు దస్త్రంపై తొలి సంతకం చేశారు విద్యకు భరోసా కల్పించే యువ వికాసం పథకంఅమలు కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

-చల్లాచంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# కొత్త ప్రభుత్వం ముందు ఉన్న సవాళ్లు!

**రేవంత్ రెడ్డి పాలనని కెసిఆర్ పాలనని ప్రజలు బేరీజు వేసి చూసే క్రమంలో రేవంత్ రెడ్డి పనితీరు మెరుగ్గా లేకపోతే ఆ ప్రభావం ప్రభుత్వ మనుగడపైన పడుతుందనడంలో సందేహమే లేదు. తెలంగాణ లాంటి ఉద్యమ నేలపై ప్రశ్నించే తత్వము ఆత్మగౌరవం మెండుగా ఉన్న ప్రజలను వారి ఆకాంక్షలమేరకు పాలించి మెప్పించడం కత్తి మీద సామే. ఈ సవాల్‌ని రేవంత్ రెడ్డి లాంటి డైనమిక్ లీడర్ ఎంత వరకు స్వీకరించి విజయం సాధిస్తారో కాలమే నిర్ణయిస్తుంది. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో కూడిన ప్రజాస్వామ్య పాలన మార్పు కోరుకున్నారు అనేది వాస్తవం. కాంగ్రెస్ నుంచి దానిని ఆశిస్తున్నారనేది సత్యం.**



డాక్టర్ తిరునహరి శేషు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత జరిగిన రెండు ఎన్నికలలో ఓటమి పాలై దరిదాపు 10 సంవత్సరాలు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ మూడోసారి జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో అనూహ్య విజయం సాధించి అధికార పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురుకాబోతున్నాయి. రాజకీయ సవాళ్లతో పాటు పాలనాపరమైన సవాళ్లు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన గ్యారంటీలు, మేనిఫెస్టో హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ప్రజలు ఆకాంక్షలను ప్రజల సమస్యలను తీర్చడమే కాదు ప్రజల మనోగతానికి అభీష్టానికి అనుగుణంగా పాలన అందించాల్సిన గురుతరమైన బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. పార్టీని ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకోవాలి. దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన పార్టీ అధినేత ప్రభుత్వ అధినేత ఒకరే కాబట్టి పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఎలాంటి గ్యాప్ కనిపించలేదు.కానీ కాంగ్రెస్ పార్టీ బిఆర్‌ఎస్ లాగా ప్రాంతీయ పార్టీ కాదు. అది ఒక జాతీయ పార్టీ కాబట్టి జాతీయ నాయకత్వాన్ని రాష్ట్ర పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయంతో నడిపించే క్లిష్టమైన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంటుందనే విషయాన్ని గమనించాలి. గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అనేక సందర్భాలలో అనేక విషయాలపై పార్టీకి ప్రభుత్వానికి మధ్య సమన్వయం కొరవడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కాంగ్రెస్ లాంటి పార్టీలో క్రమశిక్షణ రాహిత్యాన్ని అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో సొంత పార్టీ నేతలే ప్రతిపక్షాల కంటే బలంగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను విమర్శించిన సందర్భాలే ఎక్కువ. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ అధినేత ఒకవైపు, పార్టీని మరొకవైపు ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లకపోతే ఆ ప్రభావం పాలనపై పడుతుందడంలో సందేహం లేదు.గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీఆరుగ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 66 అంశాలతో కూడిన మేనిఫెస్టో భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఈ హామీల ద్వారా ప్రజలలో కాంగ్రెస్ పార్టీ ఆశలను రేకెత్తించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలను, గ్యారెంటీలను అమలు చేయడానికి దరిదాపు నాలుగు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ అవసరమవుతుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రెండు లక్షల 90వేల కోట్ల రూపాయలు మాత్రమే. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో తాను ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే మరొక లక్ష కోట్ల రూపాయల అదనపు బడ్జెట్ అవసరమవుతుంది. కాబట్టి కొత్త ముఖ్యమంత్రికి ఎదురయ్యే అతి పెద్ద సవాల్ హామీల అమలుకు కావాల్సిన నిధులను సేకరించడం. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను అమలు చేయడానికి 52వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి దరిదాపు 80 వేలకోట్ల రూపా



యలు అవసరమవుతున్నాయి. కాబట్టి ముందుగా ఈ ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కావాల్సిన నిధులను సేకరించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం రైతుబంధు, దళిత బంధు, ఆసరా పెన్షన్ల అమలు కోసం పెద్దఎత్తున అప్పులు చేసింది. భూములు అమ్మిందనే విమర్శలను ఎదుర్కొంది. గృహ వినియోగదారులకు 200 యూనిట్స్ వరకు ఉచిత విద్యుత్తును అందించడానికి దరిదాపు 3431 కోట్ల రూపాయలు అవసరమవుతుందని విద్యుత్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించడమే కాదు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వలేని పక్షంలో, కాంగ్రెస్ పార్టీ తన హామీలను అమలు చేయలేని పక్షంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి పెద్దఎత్తున విమర్శల పాలయ్యే అవకాశం లేకపోలేదు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు మనుగడ తన హామీల అమలుపైనే ఉందనే విషయాన్ని గమనించాలి. గత రెండు ఎన్నికలలో 2014లో గానీ, 2018లో గానీ శాసనసభలో బలమైన ప్రతిపక్షం ఏర్పడలేదు. అలాగే ఫిరాయింపులను ప్రోత్సహించిన పాలక పక్షం ప్రతిపక్షాల బలాన్ని తగ్గించగలిగింది. దానితో శాసనసభలో పాలక పక్షానికి పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ ముఖ్యమంత్రి పాలకపక్షం శాసనసభలో బలమైన ప్రతిపక్షాన్ని ఎదుర్కొని ప్రభుత్వాన్ని నడపాలి. శాసనసభలో ప్రతిపక్షంలో 54 మంది సభ్యుల బలం కలిగి ఉంది. కాబట్టి అనేక విషయాలలో బిల్లుల విషయంలో పాలకపక్షాన్ని ఇబ్బందిపెట్టే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వపక్షంలో సాధారణ మెజారిటీ కేవలం 65 మంది సభ్యుల బలం మాత్రమే కలిగి ఉంది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల, విధానాల వల్ల ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోతుంటే ప్రభుత్వ ఎమ్మెల్యేల బలం తగ్గిపోయి ప్రభుత్వం మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. కాబట్టి ముఖ్యమంత్రి చాలాజాగ్రత్తగా పాలనాపరమైన నిర్ణయాలలో ఆరోపణలకి, అవినీతికి తావులేకుండా ప్రజల మన్ననలను పొందాల్సి ఉంటుంది. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా చాకచక్యంగా పాలనను ముందుకు నడిపించడం ముఖ్యమంత్రికి సవాలే. తెలంగాణ రాష్ట్రానికి మూడోసారి రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డికి పాలనా అనుభవం లేదు. గతంలో ఒక్కసారి కూడా కనీసం మంత్రిగాబాధ్యతలు చేపట్టలేదు. కానీ ఏకంగా ముఖ్యమంత్రిగా వ్యవహరించబోతున్నారు. కాబట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా మంత్రులుగా పనిచేయకుండానే ఏకంగా ముఖ్యమంత్రులు కాగలిగారు. గతంలో పాలన అనుభవం లేని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని అత్యంత బాధ్యతాయుతమైన పదవిగా కాకుండా గుంపు మేస్త్రి పదవిగా భావిస్తే కచ్చితంగా సమస్యలు ఎదుర్కొంటారు. రేవంత్ రెడ్డి పాలనని కెసిఆర్ పాలనని ప్రజలు బేరీజు వేసి చూసే క్రమంలో రేవంత్ రెడ్డి పనితీరు మెరుగ్గా లేకపోతే ఆ ప్రభావం ప్రభుత్వ మనుగడపైన పడుతుందనడంలో సందేహమే లేదు. తెలంగాణ లాంటి ఉద్యమ నేలపై ప్రశ్నించే తత్వము ఆత్మగౌరవం మెండుగా ఉన్న ప్రజలను వారి ఆకాంక్షలమేరకు పాలించి మెప్పించడం కత్తి మీద సామే. ఈ సవాల్‌ని రేవంత్ రెడ్డి లాంటి డైనమిక్ లీడర్ ఎంత వరకు స్వీకరించి విజయం సాధిస్తారో కాలమే నిర్ణయిస్తుంది. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో కూడిన ప్రజాస్వామ్య పాలన మార్పు కోరుకున్నారు అనేది వాస్తవం. కాంగ్రెస్ నుంచి దానిని ఆశిస్తున్నారనేది సత్యం. ●

# ప్లాస్టిక్ మానవాళి పాలిట శాపం

డి.జయరాం

భూమిపై రోజురోజుకి పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, తుఫానులు, పిడుగులు వంటి విపత్తులను పరిశీలిస్తే రానున్న రోజులలో భూగోళంపై సమస్త జీవరాశులు ఉనికి ఎలా ఉంటుందో,ఏమో అనే సందేహం కలుగక మానదు. వీటికి ఎన్నోకారణాలు ఉండవచ్చు. కానీ కారకుడు మాత్రం వంద శాతం మనిషే. మనిషి సుఖం కోసం పర్యావరణాన్ని కాలుష్యం చేసి ప్రకృతిపట్ల తీసుకున్న అనాలోచిత చర్యల ఫలితమే ఈ విపత్తులు. అటువంటి కాలుష్యాలలో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటి. ప్రపంచవ్యాప్తంగా గత యేడాది సుమారు 390.8 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ను ఉత్పత్తిచేశారు. మనదేశంలో యేటా సుమారు 3.10 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ఉత్పత్తి అవుతున్నది. ఇది ఇలా వుంటే 2030నాటికి 619 మిలియన్ టన్నులు అవుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. పెన్నుల నుండి ఎలక్ట్రానిక్ పరికరాలు, బొమ్మలు,ఆహార నిలువలకి ఉపయోగించే కవర్లు, ఆట వస్తువులను, పి.వి.సి పైపులు, గ్లాసులు మొదలైన వస్తువులు ప్లాస్టిక్‌తోనే తయారవుతున్నాయి.ప్లాస్టిక్ అనేది చౌకగాను, సౌకర్యవంతంగా ఉండడంవలన మన జీవితంలో చాలా ఎక్కువగా పెనవేసుకుపోయింది. స్వతహాగా ప్లాస్టిక్ విషపూరితం కాదు వాటి వ్యర్థాల వలన మానవునికి,పర్యావరణానికి వచ్చే ముప్పుఅంతా ఇంతా కాదు. కిరాణా సంచులు, ఆహార పదార్థాలను నిల్వ చేసే సంచులు, నీటిబాటిల్స్, మూతలు,టీ,కాఫీ కప్పులు, హోటళ్లలో ఆహార పదార్థాలు ప్యాకింగ్ కొరకు, డ్రింక్ బాటిల్స్, ద్రవ ఔషధాలు నిల్వలో,సిరంజీల కొరకు ప్లాస్టిక్‌ని విరివిగా ఉపయోగిస్తున్నారు.ఐదువందల మిలియన్ల ప్లాస్టిక్ సంచులను ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా తయారు చేస్తున్నారు. ఇందులో తొంభై శాతం ఒకసారి వాడి పారేసేవే. ప్లాస్టిక్ మన జీవితాలని చిన్నాభిన్నం చేస్తుంది. ఇది మన ఆరోగ్యానికి ప్రమాదమని తెలిసినా దీని వినియోగాన్ని తగ్గించుకోలేకపోతున్నాం. వీధులు, మురికి కాలువలు, ప్లాస్టిక్ చెత్తతో నిండుతున్నాయి. ఇటువంటి ప్లాస్టిక్ భూమిలో కలవడానికి సుమారు వెయ్యిసంవత్సరాలు పడుతుంది. దీనిమూలంగా నేల కాలుష్యం జరిగి భూగర్భజలాలు విషపూరితం అవుతున్నాయి.కాల్చితే పర్యావరణ కాలుష్యం జరుగుతుంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని దీని వలన తరచూ అడవులు కాలిపోతున్నాయి.ప్రతి సంవత్సరం 8మిలియన్ టన్నుల కంటేఎక్కువ ప్లాస్టిక్ సముద్రాలలో కలుస్తుంది. సముద్ర ఉపరితలంలో 40 శాతం ప్లాస్టిక్ చెత్తతో కప్పబడి ఉన్నదని, ఇది ఇలా కొనసాగితే 2030సంవత్సరం నాటికి సముద్రంలో



చేపలకంటే ఎక్కువ ప్లాస్టిక్ ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో ఉన్న జంతువులు, చేపలు శరీరంలోనికి ప్రవేశించి పర్యావరణానికి ఎంతో హాని కలిగిస్తున్నాయి. కొవిడ్-19 అంటువ్యాధిని తగ్గించడానికి ఒకసారి మాత్రమే ఉపయోగించే మాస్కులు, పిపిఇ కిట్లు, శానిటైజర్లు నిలువ చేసే సీసాలు,లాక్డౌన్ సమయంలో ప్యాకేజ్డ్ ఆహారపదార్థాలలో ప్లాస్టిక్‌ని మరింత ఎక్కువ ఉపయోగించారు.ఆసమయంలో 193దేశాల నుండి 8.4మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పన్నమయ్యాయని అంచనా వేశారు. వీటిలో సుమారుగా 25,900 టన్నులు సముద్రంలో కలిశాయి. రీసైకిల్‌గా భావించే ప్లాస్టిక్‌ల్లో పూర్తిగా ప్లాస్టిక్ అదృశ్యం కావడంలేదు. ఇవి చిన్నచిన్న ముక్కలుగా విచ్ఛిన్నం అవుతున్నాయి.వీటినే నానో ప్లాస్టిక్, మైక్రోప్లాస్టిక్‌లని పిలుస్తున్నారు. ఇవి ఐదు మిల్లీమీటర్ల నుండి 100 నానో మీటర్ల వ్యాసం కలిగి ఉన్న ప్లాస్టిక్ ముక్కలు. మానవుని జుత్తు కంటే పదివంతులు సన్నంగా ఉంటాయి. ఇవి సౌందర్య సాధనాలు, పెయింట్స్ తయారీలో, నీటిసీసాలు, ప్లాస్టిక్ సంచులు విచ్ఛిన్నం చేయడం వలన ఏర్పడతాయి.నెదర్లాండ్ శాస్త్రవేత్తలు జర్నల్‌ఎన్విరాన్మెంట్ ఇంటర్నేషనల్‌లో విస్తుగొలిపే నిజాలు ప్రచురించారు. శీతలపానీయాలు నిలువచేసే ప్లాస్టిక్ బాటిల్స్ తయారీలో ఉపయోగించే పిఇటి, ఆహార ప్యాకింగ్‌లకి ఉపయోగించే పాలీస్టరీన్, అనేకరకాల ప్యాకింగ్‌ల కొరకు ఉపయోగించే పాలిథిన్‌లు ఉన్నట్లు తెలిపారు. నీరు,మొక్కలు, చేపల్లో మైక్రోప్లాస్టిక్‌లు ఉంటున్నాయి. ఇవి మనరక్తంలో చేరి మనకు ప్రమాదాలను కలిగిస్తున్నాయి.ఇవి మనం పీల్చేగాలిలో, తినే ఆహారంలో ఉంటున్నాయి. దీని వలన కేన్సర్‌వచ్చే అవకాశంఉంది. మనకు హానికలిగించే సూక్ష్మజీవులు, వైరస్‌లకు ఆవాసంగా మారి మనకు పరోక్షంగా మన ఆరోగ్యాన్ని దెబ్బతీయడానికి సహాయపడుతున్నాయి. దీనిని తగ్గించేందుకు ఐదు ఆర్‌లు ఉపయోగించాలి.అవి రెడ్యూస్, రేప్యూజ్, రీయూజ్, రీసైకిల్, రిమూవ్.ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల తయారీ, వినియోగాన్ని నివారించాలి.తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌సంచులను నిషేధించాలి.ప్లాస్టిక్‌కి బదులుగాకాగితాన్ని, గుడ్డసంచులను, గాజుసీసాలను ఉపయోగించాలి. హానికరమైన ప్లాస్టిక్‌లు ఉపయోగించే అన్ని పరిశ్రమలను మూసివేయించాలి. నీరు తాగడానికి ప్లాస్టిక్ సీసాలకు బదులుగా స్టీల్ సీసాలు, రాగి సీసాలు, గాజు సీసాలు, ఫ్లెక్సీలకు ప్రత్యామ్నాయంగా గుడ్డని, ప్లాస్టిక్ విస్తారాకులకు బదులుగా ఆకులతో చేసిన విస్తర్లువాడాలి. ఆహార పదార్థాలు నిలువ చేయడానికి మోడిఫైడ్ అట్మాస్ఫియర్ పద్ధతి ఉపయోగించాలి. అయితే ఒక్కసారిగా ప్లాస్టిక్‌ను నిషేధించలేం. దీనిపైన ఆధారపడే ఉద్యోగులు రోడ్డున పడతారు. ఈ పరిశ్రమల నుండి వచ్చే ఆదాయం కోల్పోతాం. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి మరోరంగంలో ఆదాయం వచ్చేటట్లు ప్రభుత్వాలు చేసుకోవాలి. ప్రభుత్వం ఒక్కటే ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఆపలేదు.బాధ్యత గలపౌరులుగా అందరు బాధ్యత తీసుకోవాలి. ప్లాస్టిక్ కాలుష్యం,వాటి వలన జరిగే హానిని, ప్రజలకు ప్రసార సాధనాల ద్వారా,పత్రికలద్వారా అవగాహన కలిగించాలి. అప్పుడే ఇటువంటి విపత్తుల నుండి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది.●

# జవాబుదారీతనం లోపించడమే అవినీతికి మార్గం

సంపత్ గడ్డం

దేశం ఆధునికంగా పరుగులు పెడుతుందని అందమైన రహదారులు, పెద్ద భవంతులతో ఆకర్షణీయంగా కన్పిస్తున్నా పంటి కింద బాధను దిగమింగుతూ.. వస్తులు ఉంటున్న కుటుంబాలు దేశంలో అనేకం ఉన్నాయి.పేదరికంలో మన దేశం మరింత దిగజారి సామాన్యుడు ఒకపూట భోజనం చేయలేని దుస్థితి దాపురించింది. దేశంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నప్పటికీ ఏ ఒక్కటీ పేదోడి ఆకలిని తీర్చడం లేదు.కోట్లలో బ్యాంకు రుణాలను మాఫీ చేసే ప్రభుత్వాలు, పేదోడి ఆకలి కడుపును నింపలేకపోతుంది.ఫలితంగా ఎంతో భవిష్యత్తు ఉన్నాచేసేదేమి లేక రోజు కూలీలుగా మారే పరిస్థితి దాపురించింది. అత్యాశపరులకు అండగా నిలవడమే ప్రధానంగా అవినీతికి మూలం అవుతుంది. ప్రభుత్వాల చేత పనులు చేయించుకోవడం ప్రజల హక్కు కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అవకాశం లేకుండా పోయింది. కనీసం పేదవాని ఆవేదనను అర్థం చేసుకోవడం కాదు కదా వినడానికి పాలకులకు ఓపిక లేకుండా పోయింది. ఆ నిర్లక్ష్యమే అవినీతి పెరిగిపోవడానికి కారణం అవుతుంది. ఫలితంగా దేశంలో రోజు రోజుకు పేదరికం మరింత పెరిగిపోతున్నది. దీనంతటికీ కారణం రాజకీయ వ్యవస్థ అని చెప్పక తప్పదు. రాజకీయ వ్యవస్థలో మార్పురాకుండా అవినీతి అంతం కావడం అనేది అంత సులువు కాదు. తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రజల్లో తీవ్రమైన ఆశలు కల్పిస్తూ రాజకీయ హోదాను అనుభవిస్తున్నారు. అవినీతి అనేది ఒక అంటువ్యాధి వంటిది. ఒకరినుండి ఒకరికి వ్యాధి పాకినట్టు, అవినీతి అనేది కూడా ఒకరి నుండి ఒకరికి పాకుతుంది. అంటు వ్యాధి ఆరోగ్యానికి హాని చేసినట్టు, అవినీతి కూడా సామాజిక అభివృద్ధికి కూడా అడ్డుపడుతుంది.అలా అనడానికి అసలు అవినీతి అంటే నీతితప్పి ప్రవర్తించడం అంటారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో అవినీతిని మాత్రం రూపుమాపలేకపోతున్నాం. భారతదేశం వివిధరంగాల్లో ప్రపంచ దేశాల సరసన ఆధునికంగా రాణించగలుగుతున్నప్పటికీ లంచం అనే మహమ్మారి క్యాన్సర్ కంటే అతి ప్రమాదకరంగా మారిన సమాజాన్ని పట్టి పీడిస్తుంది. ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి ప్రజలకు నిస్వార్థ సేవ చేయాల్సిన విధంగా రంగాల ఉద్యోగవర్గం బల్లకింద నుంచి చేయిచాచడం మాత్రం ఆగడంలేదు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లాలంటేనే సామాన్యప్రజలు జంకాల్సిన పరిస్థితి దాపురించింది. అటెండర్ స్థాయి నుంచి మొదలుకొని కలెక్టర్ల వరకు లంచానికి అలవాటు పడి సామాన్యప్రజలను వంచనకు గురిచేస్తున్నారు. ఆ నయవంచన వల్లే భారతదేశం నిజమైన ప్రతిభ బయటకు రాకపోవడం కారణంగా చెప్పవచ్చు. దేశవ్యాప్తంగా లంచం అనే మహమ్మారి బారిన పడిన వారెందరో గుణాత్మకతను చంపుకొని సమాజానికి తనవృత్తి ద్వారా సేవలందించాల్సిన వారు అక్రమ సంపాదనకు అలవాటు పడడంప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే లంచంలేనిదే పని జరగదనే విధంగాప్రజల్లో దొడ్డి దారిని వారి మెదళ్లో నిండా నింపారు.ప్రజలు సైతం హానాన్ని కోల్పోయి తమ అత్యుత్సాహం వల్లపని జరిగితేచాలు అన్నట్లుగా లంచం ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.అవినీతి అంతం చేయడానికి ఎన్నిరకాలుగా ప్రయత్నించినప్పటికీ అది వేళ్లనూకుపోయింది. తెలంగాణ రాష్ట్రంలోనూ అవినీతి భారీస్థాయిలోనే జరుగుతుంది. చిన్న ఉద్యోగులనుంచి కలెక్టర్ హోదా అనుభవించిన వారు సైతం లంచాలకు నీతిని అమ్మేసి అవినీతిని గెలిపిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో తహసీల్దార్ పై పెట్రోల్ పోసి చంపిన ఉదాంతం, మెదక్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేసిన ఓ వ్యక్తి కోటికి పైగా లంచంతో రెడ్ హ్యాండెడ్‌గా గతంలో దొరికిపోయారు. ఇవే కాకుండా అనేకమంది వివిధస్థాయిలోని ఉద్యోగులు లంచావతారాలెత్తి కోట్లకు పడగలేస్తున్నారు.అవినీతికి కారణంగా పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారుతున్నాయి. దారిద్ర్యం,వివిధ రంగాల్లో అస్థిరత పెరిగిపోతాయి.అంతిమంగా అది మౌలిక వసతుల వైఫల్యానికి,రాజ్య వైఫల్యానికి దారి తీస్తుంది. ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు, ఎన్జీవోలు,మీడియా, వ్యక్తులు కలసికట్టుగా అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకోవాల్సి ఉంది.అవినీతి వల్ల మానవ హక్కుల ఉల్లంఘనలు, మార్కెట్ అనిశ్చితి, జీవన ప్రమాణాల నాణ్యంలో క్షీణత లాంటివి చోటు చేసుకుంటాయి. వ్యవస్థీకృత నేరాలు పెరిగిపోతాయి. కోర్టుల్లో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయడం,హక్కుల కమీషన్లను ఆశ్రయించడం, ఇంటర్నెట్, టీవీ, ప్రింట్ మీడియాను ఆశ్రయించడం, సమాచార హక్కుచట్టం కోరడం వంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకైనా తగ్గించవచ్చు.యాంటీ కరెప్షన్ సంస్థలు ఏర్పాటు చేయడం, రాజకీయ పక్షాలకు నిధులు అందించడంలో,పాలనావ్యవహారాల్లో పారదర్శకత పెంచడం, ప్రతిభ,సామర్థ్యం లాంటి అంశాల కారణంగా నియామకాలు, ప్రమోషన్లు చేపట్టడం లాంటిచర్యలు తీసుకోవాలని ఈ రంగంలో నిపుణులు సూచిస్తున్నారు.అనుమానస్పద లావాదేవీలను గుర్తించడం, వివిధ దేశాలు పరస్పరం సహకరించుకోవడం, అన్నిరంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్నిఉపయోగించడం లాంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకు తగ్గించవచ్చు.ఎన్నికల రాజకీయ వ్యవస్థలో అవినీతి తొలగించేందుకు సంస్కరణలు చేపట్టాలి.ప్రతీ కార్యాలయంలో సేవల వివరాలు అవి పొందే విధి విధానాలు ఏ పని ఎన్నిరోజుల్లో చేస్తారో వివరించే ఫిజికల్ చార్టర్‌లు చాలాశాఖల్లో ప్రకటించారు.వీటిని సక్రమంగా అమలు జరిగేలా కార్యాచరణ ఉండాలి.పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి సమాచారం ప్రజలకు తెలుసుకునే వీలు కలిగింది. దీన్ని సక్రమంగా వినియోగించుకుంటే అవినీతి దూరమవుతుంది. కేంద్రీకృత పాలన అవినీతికి మూలమైంది. దీనికి విరుగుడుగా అధికార వికేంద్రీకరణ జరగాల్సి ఉంది. జవాబుదారీతనంతో స్థానిక ప్రభుత్వాలు సాధించాలి. మనదేశాన్ని మనమే రక్షించుకునే దిశగా ప్రతీఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా ప్రతిన బూనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అవినీతి వ్యతిరేక ఉద్యమం నిరంతరంకొనసాగాలి. దీనికి నిజాయితీ కలిగిన పటిష్టవంతమైన రాజకీయ నాయకత్వం అవసరం.చురుకైన పౌరసమాజం అంతకంటే అవసరం. ప్రభుత్వోద్యోగులు నియామకాలు, బదిలీ, పదోన్నతి, క్రమశిక్షణా చర్యలలాంటి అంశాలను స్వతంత్ర్య ప్రతిపత్తి కలిగిన సివిల్ సర్వీస్ బోర్డ్‌లాంటి వ్యవస్థకు అప్పగించాలి.రాజకీయ జోక్యాన్ని పూర్తిగా తొలగించాలి. అవినీతి నిర్మూలనకు ప్రతీ పౌరుడు కృషి చేస్తే గానీ సాధ్యంకాదు. ప్రభుత్వం చేతపని చేయించుకోవడం పౌరులుగా మన బాధ్యత.●

# సాహుపై ఐటి దాడులతో పార్టీల్లో ప్రకంపనలు!




**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపి, డిస్టిలరీ యజమాని ధీరజ్‌సాహుపై ఆదాయపు పన్నుశాఖ నిర్వహించిన దాడులను బిజెపి విమర్శనాస్త్రాలుగా ఎంపికచేసి కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతుంటే కేవలం కాంగ్రెస్ నేతలే ఉన్నారా బిజెపి నేతలు లేరా అంటూ కాంగ్రెస్ ప్రతివిమర్శలకు దిగుతోంది. ప్రస్తుతం దేశరాజధానిలో రెండుపార్టీలనాయకుల విమర్శలతో వాడివేడి వాతావరణం అలుముకుంది. కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి ధీరజ్‌ప్రసాద్‌ఖ సాహు నివాసంలో ఐటి అధికారులు రూ.290 కోట్లు నగదును స్వాధీనంచేసుకున్నారు. ఈ దాడిని బిజెపి తన విమర్శనాస్త్రంగా సంధిస్తున్నది. నేరుగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీయే అవినీతిసొమ్ము, ప్రజలనుంచి దోపిడీచేసిన సొమ్ము ప్రతిపైసా కక్కిస్తామని ప్రకటించి నాందిపలికారు. ఆపార్టీ నాయకులు ప్రసంగాలన్నీ నిజాయితీతో ఉంటా యని, ఆచరణలో మాత్రం నోట్లకట్టలు ఇలా బయటపడుతుంటాయని ఎద్దేవాచేసారు. బిజెపికి చెందిన కొన్ని రాష్ట్రాలయూనిట్లు ఐటి దాడులపై కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కూడా చేసారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం సాహు విషయంలో కొంత మౌనంగానే ఉంది. విమర్శలకు దూరంగా ఉంది. ఈ దాడుల్లోకి కాంగ్రెస్ పార్టీని ఎందుకు లాగడమని ఇప్పటికయినా విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ హైకమాండ్ చెపుతోంది. కేంద్రమంత్రి మీనాక్షి లేఖి మాత్రం అవినీతి ప్రముఖులనుంచి భారీస్థాయిలో సొమ్ము స్వాధీనంచేసుకోవడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. దీన్నిబట్టే కాంగ్రెస్ అవినీతి నాయకులను ఎలా ప్రోత్సహించిందో తెలుస్తోందని అన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడినుంచి 300 కోట్లు స్వాధీనంచేసుకున్నారని, ఇప్పటికీ లెక్కింపు జరుగుతూనే ఉందన్నారు. ఇలా కాంగ్రెస్ అవినీతి నాయకులందరిపైనా సోదాలునిర్వహిస్తే ఎంత భారీ మొత్తం వస్తుందో ఊహించడానికే అంతుబట్టకుండా ఉందన్నారు. ధీరజ్‌సాహు వ్యాపారంతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, ఈ పట్టుబడిన సొమ్ముపై ఆయనే వివరాలిస్తారన్నారు. కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేష్ మాట్లాడుతూ ఈ వివరాలు అన్నీ సాహు స్వయంగా చెప్పాలని, అంతమొత్తం ఎందుకు దాచాల్సి వచ్చిందో ఆయనే వివరణ ఇచ్చుకోవాలన్నారు. సాహు మద్యం వాపారంలో సుదీర్ఘకాలంగాకొనసాగుతున్నారని, సాహు కాంగ్రెస్ ఎంపి అయినంతమాత్రాన ఈ వ్యవహారాన్ని పార్టీకి పులమడం దేనికని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాణిక్యం ఠాగూర్ అన్నారు. కాగా ఐటిశాఖ సబల్‌పూర్, బెఒలంగిర్, టిటిలాఘర్, బౌద్, సుదార్‌ఘర్, రూర్కెలా, భువనేశ్వర్‌లలో కూడా దాడులుచేసింది. ధీరజ్‌సాహు కుటుంబం సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో ఉంది. ఆయనతండ్రి బల్‌దేవ్‌ప్రసాద్ సాహుకూడా కాంగ్రెస్‌లోనే ఉన్నారని, ఇపుడు మూడో తరం కూడా కాంగ్రెస్‌లోనే ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఒకసారి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సాహు ఇంట్లోనే బసచేసారన్నారు. సాహు బిజినెస్ సంస్థలన్నీ కూడా ఒడిశాలోనే ఎక్కువ ఉన్నాయి. ఆయన తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు రాయ్‌సాహెబ్ టైటిల్‌ను కూడాపొందారు. రాంచీ నివాసానికి సాహు తల్లి సుశీల్‌దేవి మరణానంతరం ఆమెపేరుపెట్టారు సుశీల్‌నికేతన్‌గా పిలుస్తుంటారు.



# చత్తీస్‌గఢ్ కొత్త సిఎంగా విష్ణుదేవ్‌సాయి

## గిరిజననేతను ఎంపిక చేసిన బిజెపి అధిష్ఠానం

**రాయ్‌పూర్, డిసెంబరు 10:** రాష్ట్రంలోని గిరిజన నాయకుడు కేంద్రమాజీ మంత్రి విష్ణుదేవ్ సాయ్‌ను ఛత్తీస్‌గఢ్ కొత్త ముఖ్యమంత్రిగా ఎంపికచేసారు. రాష్ట్రంలో గిరిజన జనాభా ఎక్కువ ఉన్నందున గిరిజనులనుంచే ముఖ్యమంత్రిని ఎంపికచేసుకోవాలన్న ప్రధాని మోడీ ఆలోచనలకు అనుగుణంగానే విష్ణుదేవ్‌ను ఎంపికచేసారు. రాష్ట్రంలో అత్యధికశాతం గిరిజన జనాభా ఉన్న సంగతి తెలిసిందే. 49ఏళ్ల సాయ్ పార్టీ సైద్ధాంతికవిభాగం ఆర్‌ఎస్‌ఎస్ కూడా ప్రాధాన్యతనిచ్చింది. మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు ఆయన అత్యంత సన్నిహితునిగా మెలిగారు. నాలుగుపర్యాయాలు ఎంపిగా పనిచేసిన విష్ణుదేవ్ పార్టీకి రాష్ట్ర యూనిట్ ఛీఫ్‌గా 2006 నుంచి పనిచేస్తున్నారు. వివాదరహిత ప్రతిష్టతో సంస్థాగత సమర్థతను చాటిచెప్పారు. బిజెపి జాతీయ వర్కింగ్ కమిటీకి సభ్యునిగా కూడా పనిచేసారు. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉక్కుశాఖకు జూనియర్ మంత్రిగా నియమితులయ్యారు. విష్ణుదేవ్‌ను ఎంపికచేయడంపై పరిశీలకులు ఐదు కీలక అంశాలను పరిగణనలోనికి తీసుకున్నారు.

రమణ్‌సింగ్‌కు అత్యంత సన్నిహితు నిగా ఉండటం ఒకటి కాగా సర్పంచ్‌నుంచి ఉన్నత స్థాయికి అంచలంచెలుగా వచ్చిన వ్యక్తి కావడం మరోటి. ఎమ్మెల్యేగా 1990 నుంచి 1998వరకూ పనిచేసారు. రాయ్‌ఘర్ నియోజకవర్గంనుంచి 1999 లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఛత్తీస్‌ఘర్ బిజెపి చీఫ్‌గా 2006 నుంచి పనిచేస్తున్నారు. కేంద్ర మంత్రివర్గంలో సహాయ మంత్రిగాకూడా పనిచేసారు. అన్నింటికంటే బిజెపి సైద్ధాంతిక విభాగం ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఆయనపేరుకే ప్రాధాన్యత నివ్వడం వంటి అంశాలు విష్ణుదేవ్‌కు కలిసొచ్చాయి.

**ఛత్తీస్‌గఢ్ స్పీకర్‌గా మాజీసిఎం రమణ్‌సింగ్**

ఛత్తీస్‌గఢ్ కొత్తముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌కి ఇద్దరు డిప్యూటి సిఎంలు వస్తున్నారు. మాజీ సిఎం రమణ్‌సింగ్ గట్టిపోటీ ఇచ్చినా ఈసారి ఆయన అసెంబ్లీ స్పీకర్ అవుతారని పార్టీ నేతలు చెపుతున్నారు. బిజెపి చీఫ్ అరుణ్‌సావో, సీనియర్ నాయకుడు విజయ్‌శర్మలు డిప్యూటి సిఎంలుగా ఎంపికచేయనున్నట్లు సమాచారం. 'సర్పంచ్‌నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ సుదీర్ఘకాలం బిజెపిలోనే కొనసాగిన గిరిజన నేతగా విష్ణుదేవ్ సాయ్‌ను బిజెపి హైకమాండ్ ఎట్టకేలకు ఎంపికిచేసింది. దీనితో ఛత్తీస్‌గఢ్ పరంగా ఇపుడు ముఖ్యమంత్రి అభ్యర్థిపై సందిగ్ధత వీడింది. అంతర్గత అసమ్మతి లేకుండా ఉండేందుకే చిన్న రాష్ట్రం అయినా కూడా ఇద్దరు డిప్యూటి సీఎంలను ఎంపికచేసింది. అలాగేరమణ్‌సింగ్ వ్యతిరేక బావుటా ఎగురవేయకుండా ఆయనకు స్పీకర్ పదవినిచ్చి గౌరవించింది.



## ముగ్గురు అగ్రశ్రేణి బాలీవుడ్

# నటులకు కేంద్రం షోకాజ్ నోటీసులు

**లక్నో,డిసెంబరు 10:** గుట్కా సంబంధిత వాణిజ్య ప్రకటనల్లో పాల్గొన్నారంటూ కోర్టులో దాఖలయిన పిటిషన్‌మేరకు ముగ్గురు బాలివుడ్ అగ్రనటులకు కేంద్రం షక్షకాజ్‌నోటీసులు జారీచేసింది. షారూక్ ఖాన్, అక్షయ్‌కుమార్, అజయ్‌దేవ్‌గన్ ఈ నోటీసులు అందుకున్నవారిలో ఉన్నారని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్‌కు ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. అగ్రనటులు కొన్ని హానికారక ఉత్పత్తులకు సంబంధించి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం పట్ల అభ్యంతరం వ్యక్తంచేస్తూ మోతీలాల్ యాదవ్ అనే న్యాయవాది గతంలో అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసారు. భారత ప్రభుత్వంనుంచి గౌరవప్రదమయిన పురసానకరాలు అందుకున్నవారు ఇలాంటి ప్రకటనల్లో పాల్గొనడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీన్ని విచారించిన కోర్టు పిటిషనర్ అభ్యంతరాలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అప్పట్లో ఆదేశించింది. అయితే ప్రభుత్వంనుంచి ఎలాంటి స్పందన లేదని పేర్కొంటూ ఇటీవల పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందన కోరుతూ కోర్టు కేంద్రానికి నోటీసులు జారీచేసింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం తరపున డిప్యూటి సిలిసిటర్ జనరల్ ఎస్బీ పాండే కోర్టుకు సమాచారం అందించారు. షారూక్‌ఖాన్ అక్షయ్‌కుమార్, అజయ్ దేవ్‌గన్‌లకు గత అక్టోబరు 22నే షోకాజ్ నోటీసులు జారీచేసామని వెల్లడించారు. మరోవైపు అమితాబ్ బచ్చన్ ఇప్పటికే ఈ తరహా ప్రకటనలనుంచి తప్పుకున్నారని న్యాయస్థానానికి పాండే తెలిపారు. అయినప్పటికీ ఓ గుట్కా కంపెనీ ఆయన ప్రకటనలను ప్రసారంచేసిందన్నారు. దీనితో అమితాబ్ సదరు కంపెనీకి లీగ్‌నోటీసులు పంపారని చెప్పారు.

# 'ఉచిత' పథకాలతో పోటాపోటీ రాజకీయాలు తగదు

## ప్రజలను శక్తిమంతం చేయడం అవసరం

### ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** 'ఉచిత' పథకాల పేరుతో పోటాపోటీ రాజకీయాలు చూస్తున్నామని, అవి వ్యయ ప్రాధాన్యతలను మార్చుకోవడమే అవుతుందని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. జేబులకు భరోసా ఇవ్వడం కాదని, ప్రజలను శక్తిమంతం చేయాల్సిన అవసరం ఉందని ధన్‌ఖడ్ ఉద్ఘాటించారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సం సందర్భంగా 'భారత మండపం'లో ఎన్‌హెచ్‌ఆర్‌సి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దీర్ఘకాలంలో దీని ఫలితాలపై దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన చర్చ జరగాల్సి ఉందన్నారు. భారత్ మాదిరిగా ప్రపంచంలో ఏ ప్రదేశమూ మానవ హక్కులతో విరాజిల్లడం లేదని స్పష్టం చేశారు.

'మానవ హక్కుల్లో ప్రపంచంలో ఏ భాగం కూడా భారత్ మాదిరిగా విరాజిల్లడం లేదు. మన నాగరికత, రాజ్యాంగ రూపకల్పన అనేవి మానవ హక్కులను గౌరవించడం, పరిరక్షించడం, పెంపొందించడంలో మన నిబద్ధతను చాటిచెబుతున్నాయి. ఇది మన డిఎన్‌ఎలో ఉంది' అని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఇక రాజకీయాల్లో పోటాపోటీగాచూస్తున్న ఉచితాలపై ఉపరాష్ట్రపతి స్పందించారు. 'జేబులకు భరోసా ఇవ్వడం అనేది ఆర్థికంగా ఆధారపడటాన్ని పెంచుతుంది. మనం ప్రస్తుతం చూస్తున్న ఉచిత రాజకీయాలు కేవలం వ్యయ ప్రాధాన్యతలను వక్రీకరించడమే. దిగ్గజ ఆర్థిక నిపుణుల ప్రకారం.. ఉచితాలు అనేవి స్థూల స్థిరత్వం ప్రాథమిక సూత్రాన్ని బలహీనపరుస్తాయి' అని ధన్‌ఖడ్ వెల్లడించారు. దీర్ఘకాలంలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఆర్థిక వ్యవస్థపై ఈ ప్రోత్సాహం ఎంత భారం అనే విషయాలపై జాతీయ స్థాయిలో ఆరోగ్యకరమైన చర్చ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

'అమృత్ కాల్ సమయంలోనే యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (యుడిహెచ్‌ఆర్) కూడా 75వ వార్షికోత్సవాన్ని చేసుకోవడం యాదృచ్ఛికమని జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్‌లోని ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ శోంబి షార్ప్ పాల్గొన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ పంపిన సందేశాన్ని ఆయన చదివి వినిపించారు.

# ఎంపిలో ప్రతి లోక్‌సభ స్థానంనుంచి ఒకరు కేబినెట్‌లోకి!

**భోపాల్, డిసెంబరు 10:** మధ్యప్రదేశ్ రానున్న ముఖ్యమంత్రి ఎవరన్న సస్పెన్స్ ఇప్పటికీ వీడకపోయినా భారతీయ జనతాపార్టీ మెజార్టీ స్థానాలతో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించి రానున్న లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఐదోసారి ముఖ్యమంత్రి పదవిలోకి రావాలని అభిలషించిన శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ప్రత్యామ్నాయంగా పలువురి పేర్లు వస్తున్నా సోమవారం కేంద్రపరిశీలకుల సమావేశంతో ఒక కొలిక్కి వస్తుందని సమాచారం. మొత్తం 163మంది ఎన్నికయిన బిజెపి ఎమ్మెల్యేలతో సమావేశం అయి వారి అభిప్రాయాలు తీసుకుంటారని బిజెపి అధ్యక్షుడు విడిశర్మ తెలిపారు. 18 ఏళ్లపాటు కొనసాగిన బిజెపి పాలనలోప్రభుత్వ వ్యతిరేకత ఎంతమాత్రం లేదని ఎన్నికలు రుజువుచేసాయి. ముగ్గురు కేంద్ర పరిశీలకులు సోమవారం సమావేశంతో భవిష్యత్తు ఎంపి ముఖ్యమంత్రి ఎవరన్నది తేలుతుందని శర్మ పేర్కొన్నారు. మొత్తం 163 స్థానాలు బిజెపి గెలుచుకోగా 93 స్థానాలతోకాంగ్రెస్ గెలిచింది. బిజెపికంటే 66 స్థానాలు వెనకబడింది. ఇక ముఖ్యమంత్రులుగా శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు ఇతరపేర్లు కూడా ఉన్నాయి. కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌సింగ్ పటేల్, నరేంద్రసింగ్ తోమర్, జ్యోతిరాదిత్య సింధియాలతోపాటు పార్టీ జాతీయ కార్యదర్శి కైలాష్ విజయ్ వర్గియా, పార్టీ రాష్ట్రచీఫ్ విడిశర్మలు కూడా ఉన్నారు. అయితే బిజెపి హైకమాండ్ ఈసారి కొత్త వ్యూహంతో వస్తోంది. మొత్తం 278 లోక్‌సభా నియోజకవర్గాలనుంచి కూడా మంత్రిర్గంలోప్రాధాన్యత ఉండేటట్లు ప్రణాళికలు వేస్తోంది. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంనుంచి కనీసం ఒక్కరు మంత్రిగా ఉండేవిధంగా కసరత్తులుచేస్తోంది. శివరాజ్‌సింగ్ చౌహాన్ కేబినెట్‌లో 34మంది మంత్రులున్నారు. వారిలో కేబినెట్‌మంత్రి యశోధరరాజే సింధియా ఆరోగ్యకారణాలపై ఎన్నికల్లో పోటీ చేయలేదు. సింధియా విధేయుడు ఒపిఎస్ భదోరియాకు టికెట్ రాలేదు. మిగిలిన 32 మంత్రులు ఎన్నికల్లో ఓటమి చవిచూసారు. దీన్నిబట్టిచూస్తే బిజెపి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ నియోజకవర్గాలపై ప్రభావం పడకుండా ముందునుంచే జాగ్రత్తలుతీసుకుంటున్నది. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గంనుంచి కనీసం ఒకరిని కేబినెట్‌లోకి తీసుకోవాలన్న ప్రతిపాదన వచ్చింది.

# మాయావతి వారసునిగా మేనల్లుడు ఆకాశ్ ఆనంద్

## ప్రకటించిన బిఎస్‌పి అధినేత్రి



**లక్నో, డిసెంబరు 10:** బహుజన్‌సమాజ్‌పార్టీ అధినేత్రి మాయావతి తన రాజకీయ వారసునిగా మేనల్లుడు 28 ఏళ్ల ఆకాష్ ఆనంద్‌ను ప్రకటించారు. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఆకాష్ ఆనంద్ ప్రముఖంగా పనిచేసారు. పార్టీ జాతీయ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. పార్టీ కీలక సమావేశంలో మాయావతి తన మేనల్లుడిని రాజకనఈయ వారసుడిగా ప్రకటించారు. వారసత్వ రాజకీయాలపై మాయావతి నిరంతరం విమర్శలు చేసేవారు. అయితే ఆమె కూడా అదేదారిలో వెళుతున్నారు. ఆమెసోదరుడు ఆనంద్‌కుమార్‌ను జాతీయ ఉపాధనయక్షుడిగా 2019లో ప్రకటిం చారు. ఇపుడు మేనల్లుడు ఆకాష్‌ను జాతీయ కోఆర్డినేటర్‌గా కూడా నియమించారు. ఆకాష్ వాస్తవానికి 2019 ఎన్నికలనుంచే రాజకీయాల్లోకి వచ్చారు. మాయావతి పక్కనే ఉన్న అనేక ఫోటోలు అప్పట్లో వెలుగులోకి వచ్చాయి. అంతకుముందు ఆకాశ్ అనేక బిఎస్‌పి కార్య క్రమాల్లోకూడా పాల్గొన్నారు. తన మేనత్తను వెన్నంటే ఉండేవాడు. 2017 ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలోకూడా ఆకాశ్ తన మేనత్తను వెన్నంటి ఉన్నాడు. బిఎస్‌పి నాయకుడు ఉదయ్‌వీర్ సింగ్, ఆనంద్‌లకు పార్టీ సంస్థాగతంగా పటిష్టం చేయాలని, దేశవ్యాప్తంగా పార్టీని కట్టుదిట్టం చేయాలని సూచించారని, ఆమె తర్వాత తానే వారసునిగా ఆమె ప్రకటించినట్లు ఆకాశ్ వివరించారు.

లోక్‌సభ ఎంపి డ్యానిష్ ఆలీని సస్పెండ్‌చేసిన మరుసటిరోజే ఈ రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. లోక్‌సభనుంచి విపక్షాలతోకలిసి వాకౌట్ చేయడంవల్లనే డానిష్ ఆలీని సస్పెండ్‌చేసారు. టిఎంసి ఎంపి మహువా మోయిత్రా బహిష్కరణ అంశంపై విపక్షాలు బాయ్‌కాట్‌చేస్తుంటే డానిష్ ఆలీకూడా వారితోపాటే వెళ్లారు. పార్టీని సంప్రదించకుండా ఈచర్యలకు దిగడంపై ఆయన్ను పార్టీనుంచి సస్పెండ్‌చేసారు.

# పోటీచేసే సీట్ల కేటాయింపుపైనే ప్రధాన చర్చ

## 19వ తేదీ ఢిల్లీలో ఇండియా కూటమి భేటీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** సార్వత్రిక ఎన్నికల్లో సీట్ల పంపకం ప్రధాన అజెండాగా ఈనెల 19వ తేదీ ఇండియాకూటమి మూడో సమావేశం ఢిల్లీలో జరగనున్నది. ఇందుకు సంబంధించి ఇండియా కూటమి నేతలు మరికొన్ని అంశాలపై చర్చించాలని నిర్ణయించారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీకి ఈ సీట్ల పంపకం పెద్ద సమస్యగా మారనున్నది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో ఘోరంగా ఓటమి పాలయింది. ఇప్పటికే కూటమి సభ్యులనుంచి కాంగ్రెస్ వైఫల్యం అంటూ విమర్శలు వచ్చాయి. ప్రత్యేకించి హిందీ బెల్ట్‌లోనే ఓటమి ఎదురవుతుండటం కాంగ్రెస్ కేడర్‌కుకూడా కష్టంగానేఉంది. అదేవిధంగా సమాజ్‌వాది పార్టీతో ఉన్న అభిప్రాయ భేదాలను కూడా పరిషనకరించుకుంది. ఎస్‌పి చీఫ్ అఖిలేష్ యాదవ్‌తో ఉన్న తారతమ్యాలను సరిచేసుకున్నట్లు పార్టీకేడర్ చెపుతోంది. ఇక ఢిల్లీ సమావేశానికి అఖిలేష్ యాదవ్‌కూడా పాల్గొంటారని తెలుస్తోంది. అంతకుముందు సమావేశాల్లో ఇండియా కూటమి నాయకులు పలువురు హాజరుకావడంలేదని చెప్పారు. వీరిలో అఖిలేష్‌తోపాటు మమతా బెనర్జీ, నితీష్‌కుమార్‌లు కూడా ఉన్నారు. ఈ సమావేశాన్ని ఎన్నికల ఫలితాలరోజునే నిర్వహించాలని భావించారు. అయితే వాయిదాపడి మూడురోజుల తర్వాత నిర్వహించాలనుకున్నారు. కానీ సాధ్యం కాలేదు. ప్రాంతీయపార్టీలనుంచి ఇప్పటికీ ఇండియా కూటమి నేతలకు సమస్యలు ఎదురవుతున్నట్లు అంచనా.

ఎక్కువశాతం ఎన్నికల్లో ముందు ఎవరికివారుపోటీ చేసి ఆ తర్వాత పార్లమెంటులో ఐక్యంగా నిలవాలన్న ప్రతిపాదనలు తెస్తున్నారు. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపైనా ఆయన నిరసనతో ఉన్నారు. గతంలో కూడా అఖిలేష్ కాంగ్రెస్‌తో విభేదించారు. అయితే ఈసారి ఇవన్నీ సర్దుబాటు అయినట్లు తెలుస్తోంది. అఖిలేష్‌కూడా 19వ తేదీ సమావేశానికి వస్తారని చెపుతున్నారు.

# బెయిల్‌పై బయటకొచ్చి..

# తన కేసు తానే వాదించుకున్నాడు!

## నిర్దోషిత్వాన్ని రుజువుచేసుకున్న నిందితుడు!



**మేరఠ్ (యుపి), డిసెంబరు 10:** అమిత్‌చౌదరీ అనే యువకుడు ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఓ హత్య కేసులో నిందితుడిగా రెండేళ్ల జైలుశిక్ష అనుభవించాడు. బెయిల్‌పై బయటకొచ్చి న్యాయవిద్య అభ్యసించాడు. తన కేసును తానే వాదించుకొని నిర్దోషిగా నిరూపించుకున్నాడు. ఎలాంటి తప్పు చేయకున్నా ఒక్కోసారి కొంతమంది కొన్ని కేసుల్లో నిందితులుగా ఇరుక్కుంటుంటారు. విచారణలో భాగంగా కొన్ని నెలలపాటు జైలులో కూడా గడపాల్సి వస్తుంటుంది. అలాంటి వారి బాధ వర్ణనాతీతం. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో సదరు వ్యక్తులు తీవ్రంగా కుంగిపోతుంటారు. అంతే కాకుండా మానసికంగా ఎంతోక్షోభ అనుభ విస్తారు. చిరవకు డిప్రెషన్‌లోకి వెళ్లి సాధారణ జీవితం గడపలేని స్థితికి చేరుకుంటుంటారు. కానీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమిత్ చౌదరీ అనే వ్యక్తి కథ మాత్రం అందుకు భిన్నమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.

**పోలీసుల హత్య కేసులో..**

12 యేళ్ల క్రితం అమిత్ చౌదరీ అనే వ్యక్తి చేయని నేరానికి నిందితుడిగా ఇరుక్కున్నాడు. మేరఠ్‌లో ఇద్దరు కానిస్టేబుళ్ల హత్య కేసులో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. పైగా గ్యాంగ్‌స్టర్ ముద్ర కూడా వేశారు. దీంతో ఆయన జీవితంలో ఒక్కసారిగా చీకట్లు అలముకున్నాయి. అయితే హత్యకు గురైనవారు పోలీసులు కావడంతో అప్పట్లో అందరి దృష్టి ఈ కేసుపైనే ఉండేది. నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని అప్పటి యుపి ముఖ్యమంత్రి మాయావతి ఆదేశించారు. వాస్తవానికి హత్యలు జరిగిన సమయంలో అమిత్ మేరఠ్‌లో లేరు. షామ్లీ పట్టణంలోని ఆయన సోదరి ఇంట్లో ఉన్నారు. అయినప్పటికీ ఈ కేసులో అరెస్టయిన 17 మందిలో ఆయనను కూడా చేర్చారు. కఠిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కైల్ అనే వ్యక్తికి చెందిన గ్యాంగ్‌లో సభ్యుడిగా ఉంటూ హత్యకు కుట్ర పన్నారని ఆరోపించారు. దీంతో అమిత్ రెండేళ్లపాటు కటకటాల వెనక్కి వెళ్లాల్సి వచ్చింది.

**సంక్షోభానే సదవకాశంగా..**

తన జీవితంలో వచ్చిన ఈ సంక్షోభాన్నే అమిత్ సదవకాశంతో మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. న్యాయ విద్య అభ్యసించి తన కేసును తానే వాదించుకొని నిర్దోషిగా బయటపడ్డారు. ఓ రైతు కొడుకైన ఆయన.. జైలులో వచ్చిన ప్రలోభాలకూ లొంగకపోవడం గమనార్హం. జైలు జీవితం గడుపుతున్న సమయంలో అనేకమంది తనను వారి గ్యాంగ్‌లలో చేరాలని ప్రోత్సహించారని అమిత్ స్వయంగా చెప్పారు. కానీ, తాను వాటిని తిరస్కరించానన్నారు. ఈ క్రమంలో ఓ జైలర్ కూడా తనకు సహకరించారన్నారు. తనను గ్యాంగ్‌స్టర్‌లు ఉండే బ్యారక్‌లో కాకుండా వేరే దాంట్లోకి మార్చారని తెలిపారు.

**కుటుంబం తలెత్తుకోవాలని..**

రెండేళ్ల జైలు జీవితం తర్వాత అమిత్ 2013లో విడుదలయ్యారు. ఎట్టకేలకు ఈ కేసులో నిర్దోషిగా బయటపడాలని నిశ్చయించుకున్నారు. తద్వారా తన కుటుంబం తలెత్తుకుని తిరిగేలా చేయాలనుకున్నారు. మనసులోని కుంగుబాటును పక్కనబెట్టి.. న్యాయ విద్యను అభ్యసించడంలో నిమగ్నమయ్యారు. బిఎ, ఎల్‌ఎల్‌బి, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. బార్ కౌన్సిల్ పరీక్షలో కూడా పాసయ్యారు. చట్టపరమైన అంశాల్లో వచ్చిన పట్టుతో తన కేసును తానే టేకప్ చేశారు.

పోలీసులు మొదట్లో ఎలాంటి స్టేట్‌మెంట్లు, ఆధారాలు సేకరించకపోవడంతో ఈ కేసు నత్తనడకన సాగిందని అమిత్ తెలిపారు. తన న్యాయ విద్య పూర్తయ్యే వరకు అసలు కేసులో ఎలాంటి పురోగతి రాలేదని పేర్కొన్నారు. దీంతో పూర్తిగా ఈ కేసుపైనే దృష్టి సారించి కోర్టులో వాదనలు వినిపించినట్లు చెప్పారు. విచారణలో భాగంగా ఓసారి తనను అరెస్టు చేసిన పోలీసు అధికారి బోనులో నిలబడాల్సి వచ్చిందని తెలిపారు. ఆ సందర్భంలో న్యాయవాదిగా కేసు వాదిస్తున్న తనను సదరు అధికారి గుర్తుపట్టకపోవడం జడ్జిని ఆశ్చర్యానికి గురిచేసిందని వెల్లడించారు. దీంతో కేసులో నిందితులను ఎంత గుడ్డిగా చేర్చారో న్యాయమూర్తికి అర్థమైందన్నారు.

**13 మంది నిర్దోషులే..**

అలాగే తన ప్రమేయం ఉన్నట్లుగా నిరూపించే ఒక్క ఆధారాన్ని కూడా పోలీసులు కోర్టుకు సమర్పించలేకపోయారని అమిత్ తెలిపారు. ఇలా ఈ కేసులో తనతోపాటు మొత్తం 13 మందిని కోర్టు ఇటీవలే నిర్దోషులుగా తేలుస్తూ తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. ఈ కేసులో అసలు నేరస్థులైన ముగ్గురిలో సుమిత్ కైల్.. 2013లో ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. నీతు అను మరో వ్యక్తికి కోర్టు జీవిత ఖైదు విధించింది. మరో వ్యక్తి ధర్మేంద్ర ఇటీవలే కేన్సర్‌తో మరణించాడు. కాగా, భారత్ సైన్యంలో సేవలు అందించాలన్న తన కలలు ఈ కేసుతో చెదిరిపోయాయని అమిత్ వాపోయారు. కానీ, న్యాయవాది రూపంలో దేశానికి సేవ చేసే అవకాశం లభించిందని తెలిపారు. అన్యాయానికి గురైన వారికి ఈ వృత్తితో అండగా నిలుస్తానన్నారు. క్రిమినల్ జస్టిస్‌లో పిహెచ్‌డి చేయాలనుకుంటున్నానని అమిత్ చౌదరీ తెలిపారు.

# మణిపూర్‌లోమహిళ హత్య

## తొమ్మిది మందిపై సిబిఐ ఛార్జిషీట్



**ఇంఫాల్, డిసెంబరు 10:** మణిపూర్ అల్లర్లలో 55 ఏళ్ల మహిళనుకిడ్నాప్‌చేసి హింసిచి హత్యచేసిన సంఘటనకు సంబంధించి కేంద్రదర్యాప్తుసంస్థ తొమ్మిదిమంది నిందితులపై సిబిఐ ఛార్జిషీటు దాఖలుచేసింది. 55 ఏళ్ల నాగా మహిళను కైయిబీ గ్రామంలో జులై 15న అల్లరిమూక దాడులుచేసి కిడ్నాప్‌చేసి హత్యచేసింది. గువాహతిలోని స్పెషల్ సిబిఐ కోర్టులో ఇందుకు సంబంధించి ఛార్జిషీటును కూడా దాఖలుచేసింది. మణిపూర్‌లో సావోంబంగ్ గేట్‌వద్ద వందమంది మూక ఒకేసారి వచ్చి మీదపడి ఒక మహిళను కిడ్నాప్‌చేసారు. ఆ తర్వాత ఆమెను కైయిబీ గ్రామానికి కారులో తీసుకుపోయారు. అనంతరం ఆమె మృతదేహం అదేరోజు ఆమె నివాసంలో లభించింది. ఒక మహిళను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారని, సాయుధ అల్లరి మూకలు ఈఘాతుకానికి పాల్పడ్డారని సిబిఐ తెలిపింది. కైయిబీ గ్రామానికి కారులో తీసుకువెళ్లారని, ఆ తర్వాత అదేరోజు ఆమె మృతదేహం కూడా వెలుగుచూసిందని సిబిఐ ప్రతినిధి వెల్లడించారు. ఇంపాల్ ఈస్ట్ ప్రాంతంలోని లామ్లాయ్‌పోలీస్ స్టేషన్‌లో కేసు రిజిస్టరుచేసారు. తర్వాత సిబిఐ కేసు టేకోవర్‌చేసింది. తదుపరి విచారణ కొనసాగుతుందని, ఇతర నిందితులను కూడా పట్టుకుంటామని సిబిఐ అధికారులు తెలిపారు.




## ఉమ్మడి పశ్చిమ లోక్ అదాలత్ లో 1908 పెండింగ్ కేసుల పరిష్కారం : జిల్లా జడ్జి

ప్రభాతవార్త–ఏలూరు : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9 తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కు జిల్లా వ్యాప్తంగా 36 బెంచీలు ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ వెల్లడించారు. ఇందులో భాగంగా ఏలూరులో 9 బెంచీలు, భీమవరం 4, కొవ్వూరు 4 నరసాపురం 3, తణుకు 5 తాడేపల్లిగూడెం 4, పాలకొల్లు 1, నిడదవోలు 2, జంగారెడ్డిగూడెం 2, చింతలపూడి 1, భీమడోలు 1 కోర్టుల పరిధిలో బెంచీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా వ్యాప్తంగా 1908 పెండింగ్ కేసులను పరిష్కారం చేయగా ఇందులో 1610 క్రిమినల్ కేసులు,40 కుటుంబ వివాద కేసులు, 111 మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, 147 సివిల్ కేసులను రాజీ చేయగా 151 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం చేపడ్డాయని తెలిపారు. వీటిలో ఏలూరు 428 భీమవరం 304, చింతలపూడి 103, జంగారెడ్డిగూడెం 138, కొవ్వూరు 169, నర్సాపురం 162, పాలకొల్లు 58, తాడేపల్లిగూడెం 185, తణుకు 230, నిడదవోలు 68 మరియు భీమడోలు 63 కేసులు (పెండింగ్ కేసులను) ఈ జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించామని తెలిపారు. వీటితో పాటుగా జిల్లా వ్యాప్తంగా 6804 పెట్టి కేసులను కూడా రాజీ చేయడం జరిగిందన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, జిల్లా పంచాయతీ శాఖకి, పత్రిక విలేకరులకు, విజయవాడ ఆల్ ఇండియా రేడియోకి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు మరియు మిగతా శాఖల అందరికీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కె.రత్న ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



## చాట్రాయి లో భారీ అయ్యప్ప పడిపూజ



చాట్రాయి, డిసెంబర్10, ప్రభాతవార్త : మండల కేంద్రమైన చాట్రాయిలో భారీ అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. చాట్రాయి కి చెందిన వేగ శ్రీ గోల్డ్ షాప్ అధినేత గోళ్ళ కళ్యాణ్ బాబు స్థానిక రైస్ మిల్లు ప్రాంగణంలో భారీ ఎత్తున పడిపూజ నిర్వహించగా వేలాదిమంది స్వాములు భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప, ఆంజనేయ స్వామి, దుర్గామాత మాల వేసుకున్న స్వాములు సుమారు 3000 మందికి పైగా రాగా భక్తులు కూడా అదే సంఖ్యలో పాల్గొనడంతో పూజా ప్రాంగణం భగవన్ నామస్మరణతో మారుమోగింది. కోనసీమ జిల్లా లోని రాజోలు, అంబాజీపేట నుండి ఇద్దరు గాయకులు రాగా భక్తులను వారి పాటలతో అలరించగా శివ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా ప్రాంగణం మొత్తం స్వామియే శరణమయ్యప్ప, జై హనుమాన్, దుర్గామాత కి జై అంటూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని ఆరాధించారు. కార్తీకమాసం కావడంతో శివనామ కీర్తనలు అలరించగా భక్తులు నమశ్శివాయ అంటూ నామస్మరణ చేశారు. భక్తులకు స్వాములకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయటంతో పడిపూజ విజయవంతమైంది. కార్తీక మాసం వచ్చిందంటే అయ్యప్ప స్వాములు సందడి మొదలవుతుంది. అయితే ఈ ఏడాది అధిక మాసం రావటంతో స్వాములు ముందుగానే మాలలు వేసుకుని చాలామంది శబరిగిరికి వెళ్లారు. ఈ ఏడాది చాట్రాయి మండలంలో సుమారు పదివేల మందికి పైగా అయ్యప్ప స్వాములు మాలలు వేసుకొని దీక్షలు చేపట్టి శబరిగిరికి కొందరు వెళ్ళగా మరికొందరు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. చాట్రాయి మండలంలో పలు గ్రామాలలో వందలాది మంది భక్తులు మాలలు వేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం గత 30 సంవత్సరాలుగా ఆనుమతిగా వస్తోంది. చాట్రాయి అయ్యప్ప స్వామి దేవాలయంలో 40 రోజులు పాటు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం వల్ల నిత్యం 500 మంది భక్తులకు పైగా అన్నదాన ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో అయ్యప్పలు అరటి చెట్టుతో అయ్యప్ప గుడిగా అలంకరించి పడి పూజలు నిర్వహిస్తూ ఉంటారు. గ్రామాల్లో అయ్యప్ప సందడితో భక్తి వాతావరణం మరింత పెరిగగా కార్తీకమాసం కూడా కలిసి రావడంతో గ్రామీణ ప్రాంతాల మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలో అప్పారావు గురుస్వామి, శివ గురుస్వామి మల్లికార్జున గురుస్వామి, శీను గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజల కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో గ్రామాల్లో అయ్యప్ప స్వాములు సంఖ్య రోజుకి పెరిగిపోతోంది. అయ్యప్ప మాల వేసుకుని 40 రోజులు దీక్ష చేసి అయ్యప్పను మనసారా పూజిస్తే మోక్షం లభిస్తుందని భక్తులు విశ్వాసంగా చెప్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో కూడా అయ్యప్ప స్వామికి ఆదరణ మరింత పెరిగిందనే చెప్పాలి. ఈ విధంగా అయ్యప్ప స్వాముల సందడి మండలంలో అన్ని గ్రామాలలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది.

# ఏది కొన్నా... ఎనభయ్... వందే..
## - కాయగూరలకు గిరాకీ





ప్రభాతవార్త.... నరసాపురం : తుఫాన్ అనంతరం పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా నిత్యావసర వస్తువులు దారుణంగా పెరిగాయి. బీరకాయలు వంకాయలు బెండకాయలు చిక్కుడుకాయలు కిలో 100 రూపాయలు పలుకుతున్నాయి. టమాటాలు ఒక్కటే కిలో30 రూపాయలు ఉన్నాయి.ఉల్లిపాయలు కిలో 50 రూపాయలు పలుకుతుండగా అల్లం కిలో 200 పచ్చిమిర్చి కిలో 200 వెల్లుల్లి కిలో 300 పలుకుతున్నాయి. ధరల పెరుగుదలకు తుఫాన్ ఏ కారణమని వ్యాపారాలు చెబుతున్నారు.



## కాపుల అభివృద్ధి కి పాటుపడింది వైసీపీ యే : మంత్రి కారుమూరి





అత్తిలి – డిసెంబర్ 10 ( ప్రభాత వార్త ): రాష్ట్రంలో కాపుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు వారి ఆత్మ గౌరవం, పెంచేలా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. తణుకు మండలం తేతలి గ్రామంలో నూతనంగా నిర్మించిన కాపు సామాజిక భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో కార్తీకమాసం సందర్భంగా కాపు వనసమారాధన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో గత ప్రభుత్వం హయాంలో వంగవీటి రంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతుల పేరుతో ఏర్పాటు చేయకుండా ఆడ్డుకున్నారని, తాను ఎమ్మెల్యే గా తణుకు పట్టణంలో వివిధ గ్రామాల్లో సొంత నిధులతో విగ్రహాల ఏర్పాటు చేశామని చెప్పారు. తణుకు పట్టణంలోని ప్రధాన సెంటర్ వెంకటేశ్వర దియేటర్ సెంటర్లో వంగవీటి మోహన రంగా రావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ఆరోడ్డుకు రంగా మార్గ్ గా నామకరణ చేశామని చెప్పారు. వీటితో పాటు కాపు కార్పోరేషన్ ద్వారా అనేక మందికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం తణుకు వెంకటేశ్వర ధియేటర్ సెంటర్లో నూతనంగా నిర్మించిన రంగా రోడ్డును ప్రారంభించారు. అనంతరం తణుకు పట్టణ కాపు సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమాల్లో మంత్రి కారుమూరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వర ప్రసాద్, గాజుల కాశీ, ఎంపీపీ రుద్ర ధనరాజు, అత్తిలి జెడ్పీటీసీ అడ్డాల జానకి, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, ఇరగవరం జెడ్పీటీసీ అంజిబాబు, ఎంపిపి మంగతాయారు, నాయకులు ఇందుగపల్లి బలరామ కృష్ణ, తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య పాల్గొన్నారు.



## రేపు గాలాయగూడెంలో జరిగే సంకల్ప యాత్రలో పాల్గొననున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రభాతవార్త–ఏలూరు : రాష్ట్ర గవర్నర్ ఈ నెల 12వ తేదీ మంగళవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈ నెల 12వ తేదీన దెందులూరు మండలం గాలాయిగూడెంలో 'విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్ర' లో పాల్గొంటున్న సందర్భంగా ఈ మేరకు ఆయా అధికారులకు గవర్నర్ పర్యటనకు సంబంధిన విధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ పర్యటనకు పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్లు చేయాలనీ జిల్లా పోలీస్ సుపేరింటేడెంట్ ను ఆదేశించారు. గవర్నర్ పర్యటించే మార్గంలో పారిశుధ్య పరిస్థితులు ఉండేలా ఉండాలని, గవర్నర్ పాల్గొనే కార్యక్రమం పరిసరాలలో పరిశుభ్రమైన పరిస్టితులు ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో షామియానా, డయాస్, తదితర ఏర్పాట్లు చేయాలనీ, గవర్నర్ కాన్వాయ్ పర్యటించే మార్గంలో అవసరమైన ప్రదేశాలలో రోడ్లకు మరమత్తులు చేయాలనీ రోడ్లు, భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం జరిగే ఆసాంతం విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో అత్యవసర మందులతో అంబులెన్సు సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సంబంధిత అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయముతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు.

## పంచారామాలను సందర్శించిన మంత్రి రోజా

### - దర్శనానికి రావడం తన అదృష్టంగా వెల్లడి
### - 20, 30 ఏళ్ల వరకు జగనన్నకు డోకా లేదు



పాలకొల్లు ప్రభాతవార్త : రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా పంచా రామాలయ క్షేత్రాలు పాలకొల్లు భీమవరంలోని దేవాలయాలను సందర్శించారు. తాను పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని రెండుసార్లు దర్శించుకోవడం జరిగిందన్నారు. అది తన అదృష్టం అని చెప్పారు ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న పలు వార్తలను ఖండించారు. తరచి చూస్తే వాటి నిజరూపం బయటపడుతుందని వెల్లడించారు. అటువంటి ప్రచారాలను ప్రజలు కొట్టి పారేయాలి అన్నారు. రాబోయే రోజుల్లో 20,30 సంవత్సరాల వరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉంటారని ఆయనకు ప్రజల దైవ ఆశీర్వాదం ఉందని ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ఆయనకు ఎదురు లేదన్నారు.ఆమె వెంట పాలకొల్లు ఇంచార్జ్ గుడాల గోపి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఈనెల 12 నుంచి పోస్టల్ తాత్కాలిక ఉద్యోగుల నిరవధిక సమ్మె

నూజివీడు , డిసెంబరు10 ప్రభాతవార్త: గ్రామీణ తపాల ఉద్యోగుల తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 12వ తేదీ నుంచి నిరావధిక సమ్మె చేయనున్నారు. 125 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన పోస్టల్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి బ్యాంకింగ్ రంగంలోకి అడుగు పెట్టడం జరిగిందని యూనియన్ నాయకులు అజారయ్య., నాగేశ్వరరావు లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిడిఎస్ పేరుతో ఉద్యోగులను పార్ట్ టైం గా పిలుస్తూ రోజంతా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నెలకు రూ.12 వేలు జీతం చెల్లిస్తూ జిడిఎస్ ల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జిడిఎస్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి జిడిఎస్ లకు ఉద్యోగ భద్రత కల్పించి సర్వెంట్ హోదా కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే రాయితీలన్నీ వీరికి కూడా వర్తింపు చేయాలన్నారు. పదోన్నతులు, ఇంక్రిమెంట్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి ఈ వ్యవస్థ కొనసాగుతుందన్నారు. అప్పటినుంచి అరకొర జీతాలతో గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగులు జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ఎప్పటికైనా తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తారని ఆశ భావంతో పనిచేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తమ పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. రోజు పోస్ట్ ఆఫీస్ లో ఖాతాలు ఓపెన్ చేయాలంటూ సిబ్బందిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం జిడిఎస్ ల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు. డివిజనల్ స్థాయి అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ సిబ్బంది పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. జిడిఎస్ లను బెదిరించే విధంగా కొంతమంది అధికారులు ప్రవర్తిస్తున్నారని వారు తీరు మార్చుకోకుంటే న్యాయమైన తమ కోరికల సాధన కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. డిమాండ్లు సాధించుకునే అంతవరకు నిరావధిక సమ్మె కొనసాగిస్తామన్నారు. జిడిఎస్ సోదరులందరూ ఐకమత్యం గా ఉంటూ సమ్మెకు సహకరించాలన్నారు.

## సామాజిక వర్గీయులు ఐక్యతతో మెలగడం మంచి సాంప్రదాయం - ఎమ్మెల్యే నిమ్మల



పాలకొల్లు ప్రభాతవార్త : సమాజంలో ఓకే సామాజిక వర్గీయులు ఐక్యతను చాటుకునేలా ఒక చోట కుటుంబ సభ్యులతో కార్తీక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేసుకోవడం మంచి సాంప్రదాయమని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన ఆదివారం స్థానిక క్షత్రియ కళ్యాణమండపం లో క్షత్రియుల ఆధ్వర్యంలో, స్థానిక ఏఎంసి మార్కెట్ యార్డులో శ్రీ కృష్ణ యాదవ సంఘ ఆధ్వర్యంలో, పెద్ద సాయిబాబా గుడి రోడ్ లో శ్రీ అడబాల గార్డెన్స్ లో శ్రీకృష్ణదేవరాయ సంఘ ఆధ్వర్యంలో, శిడగం సత్యనారాయణ లేఔట్ లో తెలుకుల సంఘ ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న సామాజిక వర్గీయులకు శుభాకాంక్షలు అందజేశారు. అందర్నీ ఆప్యాయతతో పలకరించారు.ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## సమాజ సేవలో అగ్రభాగాన రోటరీ సంస్థ
### - రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ - రావూరి వెంకట సుబ్బారావు



నిడదవోలు డిసెంబర్ 10 (ప్రభాతవార్త) :సమాజ సేవ చేయడంలో ప్రపంచవ్యాప్తంగానే రోటరీ సంస్థ అగ్ర భాగా న నిలిచిందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ (3020) రావూరి వెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. తమ డిస్ట్రిక్ట్ పరిధి విజయవాడ నుండి ఇచ్చాపురం వరకు ఉన్న 80 క్లబ్బుల నుండి సుమారు 5000 మంది రోటరీ సభ్యులు వివిధ రంగాల నుండి వచ్చి రోటరీ సంస్థ ద్వారా సమాజ సేవలో నిమగ్నమయ్యారని ఆయన తెలిపారు. అంతర్జాతీయ అధ్యక్షుడు పిలుపుమేరకు సమాజంలో ప్రతి వ్యక్తి మానసిక దృఢత్వాన్ని పొందడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని చూడవచ్చని ఆలోచనతో మానసిక ఒత్తిడిని పారదోలే కార్యక్రమాన్ని తమ అధ్యక్షుడు పిలుపు ద్వారా తాము విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రజల మేలు కోసమే టైకూన్ రోడ్డును తెరవమన్నాను

**- విశాఖ ఎంపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవివి**

విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త



విశాఖ నగరంలో గల సిరిపురం టైకూన్ జంక్షన్ రోడ్డు మూసివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తాము కూడా ప్రజల ఇబ్బందులు గమనించి తక్షణమే మూసివేసిన రోడ్డు తెరవమని డిమాండ్ చేస్తున్నామని విశాఖ పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు ఈమేరకు ఇప్పటికీ గత 14వ తారీఖున అప్పటి పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మకు, జీవీఎంసీ కమిషనర్‌కు వినతపూర్వకంగా లిఖిత పూర్వకంగా అందజేశామని గుర్తు చేశారు. అదేవిధంగా సర్క్యూట్ హౌస్‌కు వచ్చు ఎంతో మంది వీఐపీలు ప్రయాణించే వీఐపీరోడ్డులో ఎంతో కీలకమైన టైకూన్ కూడలి రోడ్డును జీవీఎంసీ పోలీస్ శాఖ సంయుక్తంగా మూసివేయడం వల్ల - మిగతా 8లో





కోస్తా ఆంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

- విశాఖపట్నం, ప్రభాతవార్త



# అదరహో సాహసవీర..



- ఆకట్టుకున్న నౌకాదళ విన్యాసాలు - మిన్నంటిన హర్షధ్వానాలు - ఒకదానిపై ఒకటి విన్యాసాలు చేసిన చేతక్ హెలీకాప్టర్లు
- ప్రదర్శనలో పాల్గొన్న యుద్ధవిమానాలు, సబ్‌మెరైన్లు, చేతక్ హెలీకాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలీకాప్టర్లు
- గగన తలం నుంచి జాతీయ, నేవీ పతాకాలు చేబూని ప్యారాచూట్ల సహాయంతో వేదికపై దిగిన స్కై డ్రైవర్లు
- ఆకాశం దద్దరిల్లేలా .. దిక్కులు పిక్కటిల్లేలా నేవీ విమానాల విన్యాసాలు









8లో

# నేడు పేటలో అడుగుపెడుతున్న లోకేష్

- యువగళ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు ఇంటింటికి ఆహ్వానాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన టీడీపీ రాష్ట్ర మహిళానేత అనిత
- పసుపు మయంగా మారిన జాతీయ రహదారి



8లో

# లక్కీషాపింగ్ మాల్‌లో ఫెస్టివల్ ఆఫర్స్

-సందడి చేసిన సినీతార అనసూయ






8లో

# నేడు జీవీఎంసీలోకి వాహనాలకు అనుమతి

**- జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం రద్దు : కమిషనర్**

విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త



విశాఖ నగరపాలక సంస్థ నందు సర్వసభ సమావేశం జరుగనున్న దృష్ట్యా సోమవారం జీవీఎంసీ కార్యాలయంనకు వచ్చే వాహనాలను అనుమతించడం జరుగుతుందని, జగనన్నకు చెబుదాం కార్యక్రమం రద్దు చేయడమైనదని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. విశాఖ నగర పాలక సంస్థ నందు జీవీఎంసీ సర్వసభ (సాధారణ) సమావేశం డిసెంబర్ 11వ తేదీన సోమవారం నిర్వహించనున్నందున ప్రజా ప్రతినిధులు కార్పొరేటర్లు జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, ప్రజల వాహనాలను సోమవారం జివిఎంసీ ప్రధాన కార్యాలయంలోకి అనుమతించడం జరుగునని జీవీఎంసీ నందు జగనన్నకు చెబుదాం కార్యక్రమం రద్దు చేయడమైనదని జీవీఎంసీ కమిషనర్ తెలిపారు.కావున సోమవారం వాహనాల అనుమతి మార్పు కేవలం 11వ తేదీకి మాత్రమే నని తదుపరి సోమవారం ఉంచి యాధావిధిగా నగరంలో కాలుష్య నివారణకు పర్యావరణానికి సహకరిస్తూ ప్రజా రవాణాను ప్రజలందరూ వినియోగించాలని అందరూ ఈ మార్పును గమనించి సహకరించాలని కమిషనర్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

# ఎమ్మెల్యే గణేష్ అవినీతి వల్లే వైసీపీకి రాజీనామా

**- 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ వెల్లడి**



విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అవినీతి కార్యక్రమాల వల్లనే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ వెల్లడించారు. 39వ వార్డు వైసీపీ కార్పొరేటర్ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ డాక్టర్ మహ్మద్ సాధిక్ వైసీపీకి రాజీనామా చేశారు. ఈమేరకు వన్‌టౌన్ షాదీఖాన వెనుక గల తన కార్యాలయంలో మీడియా సమావేశం పెట్టి ప్రకటించారు. కొద్ది నెలలుగా దక్షిణ నియోజకవర్గంలో వైసీపీ కార్పొరేటర్లు -మిగతా 8లో

# యువగళం ముగింపు సభ ఏర్పాట్లపై సమీక్ష



విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

యువగళం ముగింపు సభ ఏర్పాట్లపై సమీక్షించిన టీడీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర విశాఖపట్నంలో జిల్లాలో ముగిస్తున్న సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లపై ఆదివారం నగరంలో ఒక హోటల్‌లో జోన్ వన్ ఇంచార్జి దామచర్ల సత్య నేతత్వంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి తూర్పు నియోజకవర్గం రామకృష్ణబాబు శాసనసభ సభ్యులు తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, భీమిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి కోరాడ రాజబాబు మాజీ కార్పొరేటర్ ఆళ్ళ శ్రీనివాస్‌రావు భాస్యం ప్రవీణ్ తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# ఘనంగా కెకెఆర్ ట్రోఫీ ముగింపు

-విజేతలకు బహుమతులు -ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాగిరెడ్డి హాజరు



8లో

# 117వ ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహణ

- ఆరోగ్యసంరక్షణ కింద 350 మందికి పైగా కంటిపరీక్షలు





8లో



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

# అర్ధరాత్రివేళ సైతం ఘనస్వాగతం

## ప్రత్తిపాడులో చంద్రబాబుకు జేజేలు పలికిన ప్రజానీకం

**అమరావతి, డిసెంబర్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:** తుఫాన్‌కు దెబ్బతిన్న పంటల పరిశీలనలో తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఉన్న సంగతి తెలిసిందే.తాజాగా ఆయన గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు అర్ధవేళకు చేరుకున్నారు. అయిప్పటికీ ప్రజలు ఆయన కోసం ఎదరు చూస్తూ ఘనస్వాగతం పలికారు. చంద్రబాబు ప్రత్తిపాడులోకి రావటంతో ప్రజల తరలివచ్చారు. యువతుల నుంచి వృద్ధులు సైతం ఆయన కాన్వాయ్ వెంట పరుగులు తీశారు. చిన్నపిల్లలను తీసుకుని తల్లులు, బైక్‌లపై కుర్రకారు భారీగా పాల్గొన్నారు. అనంతరం అర్ధ రాత్రి దాటాక పుల్లడిగుంటలో కూడా ప్రజలు ఆయనకు జేజేలు పలికారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీసవేతనం ఇవ్వాలి

## ఎపిజెఎసి అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు

**విజయవాడ,డిసెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలని ఏపీజెఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేసారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వారికి వేతనాలు ,ఇతర సదుపాయాలు కల్పించాలనా న్నరు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ కోసం తామంతా ప్రభుత్వంతో పోరాడతామన్నారు. విజయవాడ జింఖానా మైదానంలో ఏపీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రదమ మహాసభల్లో ఆయన కీలక ప్రసంగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని హక్కులు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కలిగించాలన్నారు.వారికి కనీస వేతనం అమలు చేయాలన్నారు, గురుకుల, ఆర్టీసీ,ఇరిగేషన్ చేసేవారిని ఆప్కాస్ లోకి తీసుకోవాలన్నారు.వాళ్ళకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు.మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. ఔట్‌సోర్సింగ్ సేవల సిబ్బందికి సంక్షేమ పథకాలు ఆపేశారన్నారు.వాటిని అమలు చేయాలన్నారు.వారి సమస్యలు పరిష్కారానికి ఏపీజెఏసీ పోరాడుతుందన్నారు.వారికి ఏ హక్కులయితే కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిందో వాటన్నింటిని అమలు చేయాలన్నారు. వారి శ్రమకు తగిన వేతనం ఇవ్వాలన్నారు. అర్హతలను బట్టి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లోకి తీసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.తమ సమస్యలు పరిష్కారం అయ్యేందుకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. వారికి తమ సహకారం ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేసారు.ఏపీజెఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి దామోదర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

# హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించాలి

**విజయవాడ,డిసెంబర్10,ప్రభాతవార్తప్రతినిధి:** మానవహక్కులను భంగం కలిగించే శక్తులను ధైర్యంగా ప్రతిఘటించాలని పలువురు వక్తలు ఉద్బోదించారు.అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం హ్యూమన్ రైట్స్ దక్షిణ భారత విభాగం అధ్యక్షుడు ఆత్కూరి బాలాజీ అధ్యక్షతన ఎన్టీఆర్ జిల్లా నందిగామ సెయింట్ మరియ నివాస్ విమెన్స్ కళాశాలల్లో జరిగిన జాగృత సదస్సులో వారు ప్రసంగించారు. జీవించడానికి చట్టం అనేక హక్కులు కల్పించిందని బాలాజీ తన అధ్యక్షోపన్యాసంలో స్పష్టం చేసారు. ఆడపిల్లలకు అనేక హక్కులున్నాయన్నారు.లింగవివక్షను ఎక్కడైనా అమలు చేస్తే ప్రశ్నించవచ్చునన్నారు.దానిపై చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు.ఆడపిల్లలను వేధింపులకు గురిచేసే పరిస్థితులు అధికంగా ఉన్నాయన్నారు.వాటికి బెదిరిపోకుండా 100 టోల్‌ఫ్రీ నెంబరుకు, దిశ యాప్‌కు ఫిర్యాదు చేయ వచ్చునన్నారు.ఆయా కేసులను బట్టి ఫిర్యాదు వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. సీనియర్ అధ్యాపకులు తత్వవేత్త తుర్లపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ మానవీయ విలువలు, అమ్మ ప్రాధ్యానత వివరించారు. ఎదుగుదలకు చదువు అవసరమని తెలిపారు.ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, విద్యార్థినీలు సున్నిత ఆలోచనలు చేయకూడదని సీనియర్ జర్నలిస్టు ఘంటా విజయకుమార్ వ్యాఖ్యానించారు. ఆత్మ హత్య అనేది సమస్యకు పరిష్కారం కాదన్నారు. ప్రతి విషయానికి తొందరపడకూడదన్నారు. తల్లిదండ్రుల మనోభావాలను గౌరవించాలని అధ్యాపకులు కందుల వెంకట్రావు, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ అనితా విద్యార్థులకు మార్గ దర్శనం చేసారు.

# సంగీతం సర్వజన సమ్మోహితం

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

### విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజన కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి

**విజయవాడ,డిసెంబరు10,ప్రభాతవార్తప్రతినిధి:** కళా,సాంస్కృతిక రంగాలకు కేంద్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని భారత ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసారు. కళాకారులకు ప్రధాని నరేంద్రమోడీ ఆదేశాలకు అనుగుణంగా పెన్షన్ సదుపాయాన్ని వారి జీవన వసరాలకు అనుగుణంగా అందిస్తున్న విషయాన్ని గమనించాలన్నారు.సంగీతం సర్వజన సమ్మోహితమన్నారు. ఆహ్లాదకరమైన జీవన విధానాన్ని ఉపదేశిస్తుందన్నారు.అన్ని వర్గాల్లోను సంగీతం ఒక ఉపశమనం అన్నారు.గృహ,శ్రామీక జీవనంలో సంగీతం.గానం,గేయం కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. సంగీతాన్ని వైద్యరంగంలోను ఉపయోగిస్తున్నారన్నారు.విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగిస్తూ సంగీతం ఎటువంటి మానసిక సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా సమ్మోహపరిచి ఉత్సాహన్ని ఇస్తోందన్నారు.కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ఏపీ ప్రభుత్వానికి ఆమె అభినందనలు తెలిపారు. తాను చిన్నప్పటి నుంచి తెలుగు వింటూ జీవించానన్నారు.తెలుగు సాంస్కృతిక జీవన విధానం అద్భుతమన్నారు.సంగీతంలో విశిష్టులు తెలుగు వారు కావడం గొప్ప విషయంగా ఆమె అభివర్ణించారు. దేశ,విదేశాల్లో గుర్తింపు రావాలంటే చెన్నయి, తమిళనాడు లాంటి ప్రాంతాలకు వెళ్ళాలన్పించేదన్నారు.మొవ్వ,తంజావురు,రాజమండి,బొబ్బిలి లాంటి ప్రాంతాలు ప్రతి వారు గుర్తుంచుకోవాలన్నారు.కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం కృష్ణవేణి సంగీత నీరాజనం జరగాలన్నారు.విదేశాల నుంచి తెలుగువారు ఈ కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలన్నారు.భవిష యత్తు ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. విశాఖపట్టణం, రాజమండ్రిలో కూడా ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.ఏపీ సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వాన్ని అవకాశం కల్పించిన కేంద్రమంత్రి నిర మ్మలా సీతారామన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. నిర్మలా సీతారామన్ చాలా మంది మహిళలకు ఆదర్శమన్నారు. మహిళా ఎదగడానికి ఎన్నో ఆటం కాలుంటాయన్నారు.

కృష్ణవేణి సంగీత నీరాజనం ఈ తరం వారికి ఒక గొప్ప అవకాశం అన్నారు. కర్నాటక సంగీతం తెలుగునేలపై విరాజిల్లుతుం దన్నారు.సంగీతం ఎటువంటి భావాన్నయిన ప్రతిబింబించేందుకు ఒక అస్త్రం వంటిదన్నారు. మూడు రోజుల పాటు ఈ కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్,పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.విద్యావతి ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు. అనంతరం కర్నాటక సంగీతంలో ప్రసిద్దులైన విద్యాంసుల కచేరీ కార్యక్రమాలు కొనసాగాయి. రసజ్ఞులను అలరించే దిశలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# ఆ 54మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

## జిల్లా వ్యాప్త ఉద్యమాలకు ఎఐటియుసి నిర్ణయం



**తిరుపతి,డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానమ్ ఆధ్వర్యంలోని తిరుపతిలో ఉన్న గోవిందరాజస్వామి సత్రాలలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న 54మందిని విధుల నుండి తొలగించడం దారుణమని, వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటియుసి తిరుపతి జిల్లా విభాగం డిమాండ్ చేసింది. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. టిటిడి కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని ఎక్కడో ఓ చోట ప్రత్యామ్నాయం కల్పించాలన్నారు. ఆదివారం ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సమావేశం తిరుపతిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో టిటిడి కాంట్రాక్టు వర్కర్స్ తొలగింపు, వారి సమస్యలుపై చర్చించారు. ధార్మికసంస్థ టిటిడిలో కాంట్రాక్టు కార్మికులుగా వేలాదిమంది పనిచేస్తున్నారని, వారంతా అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. నెలవారీ జీతాలు రెగ్యులర్‌గా రావడంలేదని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం లేదని వాపోయారు. ఇప్పటికే కొంత మందిని లక్ష్మీశ్రీనివాస కార్పొరేషన్‌లో కలిపారని, కొంతమందిని కలవకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ధర్మాన్ని రక్షించండి ధర్మమే కాపాడుతుంది అని ప్రచారం చేసే టిటిడిలో కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్షతలు చూపడం సరైంది కాదని పేర్కొన్నారు. అనంతరం 54మందితో టిటిడి కాంట్రాక్టు వర్కర్స్ నూతన కమిటినీ ఎన్నుకున్నట్లు రాధాకృష్ణ తెలిపారు. గౌరవ అధ్యక్షుడుగా ఎన్‌డి రవి, గౌరవ సలహాదారుగా సిహెచ్ శివకుమార్, అధ్యక్షురాలుగా కె.ద్రాక్షాయణి, కార్యదర్శిగా కె.అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.సరిత, కోశాధికారిగా ఎన్.శివమ్మతో బాటు ఉపాధ్యక్షులు, సమితి సభ్యలను ఎన్నుకున్నారు.

# క్రిమినల్ చట్టాలకు కేంద్రం తెస్తున్న సవరణలను ఉపసంహరించాలి

## పౌరచైతన్యవేదిక క్యాండిల్ ర్యాలీ




**తిరుపతి,డిసెంబర్ 10ప్రభాతవార్తప్రతినిధి:** క్రిమినల్ చట్టాలైన ఐపిసి,సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్టులకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సవరణలు పూర్తి అప్రజాస్వామికమని పౌర చైతన్యవేదిక సభ్యులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరుపతి బాలాజీకాలనీ నుండి టౌన్ క్లబ్‌కూడలి ఎన్టీఆర్ విగ్రహం మీదుగా బాలాజీ కాలనీ బస్టాప్ వరకు క్రొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పౌర చైతన్యవేదిక సభ్యులు ప్రతాప్‌సింగ్, అజీజ్‌బాషా, షేక్‌జబ్బార్ మాట్లాడుతూ ప్రపంచంలోనూ,మన దేశంలోనూ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన, అణచివేతల గురించి ప్రస్తావించారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా ప్రజలపై చేస్తున్న యుద్ధదాడుల్లోమానవ హక్కులు మంట కలుస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. యుద్ధ నేరాలకుపాల్పడ్డ ఇజ్రాయిల్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రులు, పాఠశాలలపై బాంబు దాడులు కురిపిస్తూ 17వేల మంది అమాయక ప్రజలను, పసిపిల్లలను, స్త్రీలను చంపడం, జాతి మొత్తాన్ని నిర్మూలిస్తామని ప్రకటించడం దారుణమని ధ్వజమెత్తారు. మనదేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మానవ హక్కుల అణచివేత యదేచ్ఛగా జరుగుతుందన్నారు.కేంద్రప్రభుత్వం తీసుకున్న క్రిమినల్ చట్టాల సవరణలను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో ఏఐఎంఎస్ఎస్ మహిళా సంఘం ఇన్‌ఛార్జి లక్ష్మీసింగ్, రామచంద్రయ్య, హరీశ్, సుబ్బయ్య, అమీనా, తేజశ్రీ,నవీన్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉదాసీన వైఖరి వీడి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయండి

**అంజూరు తారక శ్రీనివాసులు**

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రసన్నవరదరాజస్వామి ఆలయం శతాబ్దాల కాలం నాటిదని దదానిని పునర్నిర్మాణం గురించి నిధులు కేటాయించామని కానీ పనుల నిర్వహణకు సంబంధించి కాంట్రాక్టర్లు, అధికారులు ఉదాసీన వైఖరి వ్యవహరిస్తున్నారని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేసారు.ఆదివారం వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులును పరిశీలించారు.ఆయనతో పాటు ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిష్టాత్మకంగా పురాతన కాలం నాటి వరదరాజస్వామి ఆలయాన్ని మరమ్మత్తులు చేయటానికి ప్రయత్నించగా ఆలయం మరమ్మత్తులు సాధ్యపడదని స్థపతి చెప్పగా పునర్నిర్మాణానికి సంబంధించి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చొరవ చూపి రూ.7కోట్లు నిధులు కేటాయించామన్నారు.



ఆలయ పనులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు,చైర్మెన్ శ్రీనివాసులు

**నెల రోజులుగా ఆగిన పనులు:** శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రసన్నవరదరాజస్వామి ఆలయం నిర్మాణ పనులు సుమారు నెల నుంచి ఆగిపోవటంపై చైర్మెన్ తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. ఈమేరకు అధ్యక్షులు శ్రీనివాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.తాము ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనులు ఎందుకు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు.కాంట్రాక్టర్లు పనులు చేయకుండా ఉంటే ఎందుకు ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోరని ప్రశ్నించారు.ఈ నిర్లక్ష్యాన్ని తాను శాసనసభ్యులు దృష్టికి తీసుకెళ్ళి చర్చిస్తామని అయితే అధికారులు కాంట్రాక్టను రప్పించి చర్చించి పనులు వెంటనే చేపట్టకుంటే కాంట్రాక్టు రద్దు చేస్తామని శ్రీనివాసులు స్పష్టం చేసారు.పనులు చేపట్టినపుడు శాసనసభ్యులు స్పష్టంగా వైకుంఠ ఏకాదశి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించామని కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నత్తనడకన జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాలుగులేయర్ల పనులను ఒకే సారి చేపట్టుటకు కార్మికులు, యంత్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు.ఈ పరిశీలనల్లో చీఫ్ ఇంజనీర్ పుల్లయ్య, ఇఇ నూకారత్నం, ఎఇఇ కిషోర్‌కుమార్, సూర్యప్రసాద్ దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## భయాందోళనకు గురవుతున్న జగనన్న కాలనీవాసులు....



నక్కపల్లి, డిసెంబర్ 10,ప్రభాతవార్త

ఉపమాక జగనన్న కాలనీలో అయ్యన్నపాలెం, ఉపమాక, నక్కపల్లి, బోదిగల్లం, జానకయ్యపేట గ్రామాల లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వీరిలో కొందరు గృహాలు నిర్మించుకున్నార పి. మిచౌంగ్ తుపాను కారణంగా గత మంగళవారం భారీ వర్షం కురిసింది. ఈ కాలనీలో డ్రైన్లు, రహదార లు లేకపోవడంతో వర్షపు నీరు ఆరు రోజుల నుంచి ఇళ్ల మధ్యే నిలిచిపోయింది. ఉపమాక జగన్న కాలనీలో ఎక్కడ చూసినా జనావాసాల మధ్య వర్షపు నీరే నిల్వవుండిపోయింది. రోజుల తరబడి వుండిపోవడంతో సాయంత్రమైతే దుర్వాసన వస్తోందని, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని పలువురు వాపోతు న్నారు. పాముల బెడద కూడా ఎక్కువగా వుందని ఆందోళన చెందతున్నారు. పలువురు సీజనల్ వ్యాధులు సోకుతున్నాయని చెబుతున్నారు. తుపాను వచ్చి వారం రోజులు కావస్తున్నా కనీసం ఒక్కరోజూ కూడా పంచాయతీ ద్వారా శానిటేషన్ చేయకపోవడంతో ఇక్కడ పరిస్థితి భయానకంగా కనబడుతోంది. కనీ సం బ్లీచింగ్ కూడా చల్లలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. దీనిపై సోమవారం అనకాపల్లి జిల్లా కలె కర్కు స్పందనలో ఫిర్యాదు చేస్తామని కాలనీ వాసులు చెప్పారు.

## విభిన్న ప్రతిభావంతులు అధైర్య పడకూడదు: అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్



అనకాపల్లి, డిసెంబర్ 10, ప్రభాతవార్త

విభిన్న ప్రతిభావంతులు ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ అధైర్య పడకూడదని అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ రాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గవరపాలెం గౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మ నూన్యతాభావాన్ని దరిచేరనీయకూడదన్నారు. సమాజంలో మిగిలిన వారి వలె కార్యక్రమాలలో పాల్గొనడం చదువు, వైద్యం పొందడంలో వారికి ఎన్నో ఇబ్బందులు ఏర్పడుతుంటాయన్నారు. కాబట్టి జీవితంలో వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ప్రతివారు వారిపట్ల సానుభూతి బదులు వారిని ప్రోత్సహించాలన్నారు. అనకాపల్లి జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా నర్సీపట్నం, అచ్యుతాపురం ప్రాంతాలలో గ్రూపులుగా ఏర్పడి లోనుకు దరఖాస్తు చేశారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నానని ప్రతి ఒక్కరూ వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని పొందేందుకు అందరికీ అవగాహన కల్పించి సహాయం చేస్తున్న పి.ఎస్.తిరుపతి పట్నాయక్ కృషిని ఆయన అభినందించారు. వీరు ఏ విషయంలోనూ తక్కువ కాదని, వీరిలో కూడా అనేక ప్రజ్ఞ పాటవాలు ఉంటాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఆత్మవిశ్వాసంతో సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలన్నారు. వారి పట్ల సమాజం దృక్పథాన్ని మార్చుకోవాలన్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్, ల్యాప్ టాప్, కంప్యూటర్ మొదలైనవి వీరికి ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి అన్నారు. ఆర్.పి.డి. చట్టం చట్టం సభ్యులు పి.ఎస్. తిరుపతి పట్నాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేసిన ఎన్నో పోరాటాల మూలంగా ప్రభుత్వాలు వికలాంగులు అనే పేరును విభిన్న ప్రతిభావంతులుగా మార్చారని, అదే విధంగా ఎన్నో సౌకర్యాలను కల్పించారని తెలిపారు. సాంకేతిక కారణాలతో కొంతమందికి పింఛన్లు ఆగిపోయాయని, వాటిని పునరుద్ధరించాలనీ, పింఛన్ మొత్తం పెంచాలని కోరారు. తమకు వృత్తి విద్యలలో కూడా ప్రవేశాలు కల్పించాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేసి నిర్మాణంలో చేయూత నివ్వాలని కోరారు. అనంతరం యువతీ యువకులకు ప్రభుత్వం మంజూరు చేసిన సెల్ ఫోన్లు, ల్యాప్ టాప్‌లు, వినికిడి యంత్రాలు అందచేశారు. బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జగదీష్, ఆర్.పి.డి. మెంబర్లు వీరు యాదవ్, రవి, అర్జునరావు, మదర్ థెరిసా సంస్థ ప్రతినిధులు కే.సన్యాసినాయుడు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి



నర్సీపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ జింఖాన గ్రౌండ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు అన్ని శాఖలలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్‌కి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. అలాగే వేలాది మంది వర్కర్స్ ప్రతీ నెల సక్రమంగా జీతాలు రాక పస్తులతో కాలం వెళ్ళబుచ్చుతూ అనేక భాదలు అనుభవిస్తున్న వారికి ప్రభుత్వం మంచి మనసుతో న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భద్రా శ్రీను, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ భూపతి గురుప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ధనలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వైస్సార్సీపీ వాహన యాత్ర.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో రోడ్ షో



రాజవొమ్మంగి, డిసెంబరు 10, ప్రభాతవార్త

అల్లూరిజిల్లా రాజవొమ్మంగి మండలంలో ఈ నెల 14, 16 తేదీల్లో నియోజకవర్గంలో మొట్టమొదటిగా వైస్సార్సీపీ వాహనయాత్ర కార్యక్రమం ప్రారంభమవుతున్నట్లు మండల వైస్సార్సీపీ కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, అడ్డతీగల జడ్పీటీసీ మద్దాల వీర్రాజులు పాత్రికేయులకు తెలిపారు. వాహనయాత్ర పోస్టల్ ఆవిష్కరణ కార్యక్రమం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో జరిగింది. 14, 16 తేదీల్లో జరిగే ఈ యాత్రలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ్ భాస్కర్, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని, నాలుగేళ్ల జరిగిన పాలన పై వివరిస్తూ ప్రజాసమస్యలు తెలుసు కొంటారని వైస్సార్సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్ రాజు అన్నారు. కార్యక్రమ వివరాలను వెంకటేష్ రాజు వివరించారు. 14వ తేదీ గురువారం వైయస్సార్ వాహన (యాత్ర రోడ్ షో) కార్యక్రమంలో వట్టిగడ్డ, రాజవొమ్మంగి, శరభవరం, కింద్ర కింద్ర, లబ్బర్తితో యాత్ర ముగుస్తుందని అన్నారు. 16వ తేదీ శనివారం వైయస్సార్ వాహన యాత్ర (రోడ్ షో) కార్యక్రమం లో బలిజపాడు, వంచంగి, కరుదేవపాలెం, చికిలింత, కొమరాపురం, అమీనాబాద్ గ్రామం మీదుగా జడ్డంగి సాయంత్రం 5.30 గంటలతో యాత్ర ముగుస్తుందని వెల్లడించారు. వాహన యాత్ర (రోడ్ షో) కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కన్వీనర్ రామకృష్ణ కోరుతున్నారు. సింగిరెడ్డి రామకృష్ణ, దాట్ల వెంకటేష్ రాజు, కొంగర మురళీ కృష్ణ, అడపా కామేశ్వరరావు, చీడి శివ, బూసరి సత్యనారాయణ కనిగిరి గంగ దుర్గ, బొడ్డు వెంకటరమణ, నాగులపల్లి కుశరాజు, అధికారి సత్యనారాయణ, ముసలయ్య, కనిగిరి రాజబాబు, అంకం రవి, చీడిపల్లి శాంతకుమారి, పల్లి వెంకటరమణ, చింతలపూడి వెంకటరమణ, బంటుపల్లి చంద్రరావు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వైభవంగా గౌరీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం



గాజువాక, డిసెంబర్ 10,ప్రభాతవార్త

పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ అశోక్ నగర్‌లో కొలువై ఉన్న శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు సందర్భంగా ఆదివారం ఆది దంపతులైన గౌరీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం వేదమంత్రాల నడుమ పురోహితులతో వైభవంగా జరిగింది. ముందుగా ఈ కార్యక్రమానికి వైకాపా నగర ప్రధాన కార్యదర్శి సరగడం పత్నిరావు ముఖ్య అతిథిగా పాల్గొని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారిని పల్లకిలో పురవీధుల్లో ఊరేగింపుగా స్వామివారిని ఊరేగించారు. పార్వతీ పరమేశ్వరులకు కళ్యాణం జరిపించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి పురోహితుల దీవెనలు వీరందరూ అందుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాస శ్రీ గౌరీ పరమేశ్వరుని ఉత్సవాలు ఈ నెల 16వ తారీకు అనుపు కార్యక్రమంలో ముగింపు జరుగుతుందని, అదే రోజు శనివారం మహోత్సవాలు ముగింపు కార్యక్రమంలో సేవ గరిడి, కోలాటం స్టేజ్ ప్రోగ్రాములు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పివి సురేష్ కమిటీ సభ్యులు దాడి నాగరాజు మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు పోలమరశెట్టి జగన్నాధ రావు పొలమర శెట్టి రమణ సరగడం సూరిబాబు బి సెట్టి అప్పలనాయుడు విల్లూరి మహేశ్వరరావు కాళ్ల గణేష్ ఆళ్ల నాయుడు బుద్ధ లక్ష్మణరావు ఆదారి కృష్ణ అప్పారావు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

## పాడేరులో ఘనంగా శ్రీ అయ్యప్ప స్వామి అంబలం పూజ



పాడేరు, డిసెంబర్10, ప్రభాతవార్త

పాడేరు వెయ్యాకుల సత్యనారాయణ గురుస్వామి పీఠం అధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి అంబాళం పూజా మహోత్సవం పాడేరు మెయిన్ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ అంబలం పూజకు అయ్యప్ప స్వాములు, శివధారణ చేసిన స్వాములు, భవానిలు అధిక సంఖ్యలో హాజరై అయ్యప్ప స్వామి శరణ ఘోషతో మెయిన్ రోడ్డు ప్రాంగణం దద్దరిల్లింది. అయ్యప్ప భక్తులతో పాటు ప్రజలు హాజరై స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. అంబలం పూజ సందర్భంగా అయ్యప్పస్వామి 28 మెట్లతో అరటి దవ్వలతో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం అందర్నీ ఆకట్టుకుంది.

# మొక్కలకు మజ్జిగ, ఇంగువ !



కాలక్షేపానికో, అభిరుచిని పెంచుకునేందుకో ఈ మధ్య అందరూ.. మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంటి పెరట్లోనే కాదు, మిద్దెతోటలూ, బాల్కనీల్లోనూ ఆకుకూరలూ, పండ్లూ, కూరగాయలు వంటివీ సహజంగా పెంచేస్తున్నారు. వీటి ఎదుగుదలకు సొంతంగా ఇంట్లోనే ఎరువుల్నీ తయారు చేసుకోవచ్చు. అదెలాగో చూద్దామా !

- ఆవుపాలను తోడుపెట్టి ఆ పెరుగును ఐదురోజుల పాటు బయట నిల్వ ఉంచాలి. తర్వాత దీన్ని చిలికి ఒక లీటరు పెరుగుకి 16లీటర్ల నీటిని కలిపి వడకట్టుకోవాలి. ఇప్పుడు ఇందులోని సగం మజ్జిగకు, పెద్ద చెంచా ఇంగువ పొడికలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. మిగిలిన మజ్జిగను మొదళ్లదగ్గర పోస్తే సరి. చీడపీడలను తట్టుకుని మంచి దిగుబడిని ఇస్తాయి.
- మొక్క పచ్చగా కనిపించాలంటే నెలకోసారి దాని మొదళ్లలోని మట్టిని గుల్ల చేసి కొద్దిగా వర్మీకంపోస్ట్‌తో పాటూ ఎప్సమ్‌సాల్ట్‌ని కూడా వేయాలి. ఇలా చేస్తే అది ఏపుగా ఎదగడమే కాదు కొత్త చిగుళ్లూ వస్తాయి.
- ఎరువు తయారీకి అరటి పండు తొక్కలే కాదు అన్ని రకాల పండ్ల చెక్కునీ ఇందుకు వాడొచ్చు. లేదా సెనగల్ని నీళ్లల్లో వేసి వాటికి కాస్త బెల్లం కూడా కలిపి వారం రోజులు పాటు పులియబెట్టాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి లీటరుకి ఐదు లీటర్ల నీళ్లను కలిపి ఎరువు తయారు చేసుకోవాలి. ఇప్పుడు దీన్ని కుండీలో మొక్కలపై చల్లినా, మొదళ్లకు పోసినా సరే సరిపడా పోషకాలు అందుతాయి. క్రిమికీటకాల నుంచి తగిన రక్షణా లభిస్తుంది.
- రసాయనరహితంగా మిద్దె తోటలను పెంచుతున్నామంటే తెల్లదోమ, పేనుబంక, బూడిద తెగులు.. వంటి చీడపీడలెన్నో ఇబ్బంది పెడతాయి. వీటి నివారణకు చెంచా చొప్పున దాల్చిన చెక్కపొడి, పసుపు తీసుకుని వాటికి రెండు లీటర్ల నీటిని కలిపి మొక్కకు అందించాలి. ఈ మిశ్రమానికి మరికొన్ని నీళ్లను కలిపి ఆకులపై స్ప్రే చేస్తే చీడ వదిలి ఆరోగ్యంగా ఎదుగుతాయి. ❑

# యువ వ్యాపారవేత్తలకు అండగా..



**బాగా సంపాదించొచ్చు.. మంచి అవకాశాలంటూ యువత విదేశాలకు వెళ్లిపోతోంది. ఇలాగైతే దేశ భవిష్యత్తు, ఎకానమీ దెబ్బతింటాయి కదా! ఇదే ఆలోచించారు కాసరగడ్డ శకుంతల. విద్యార్థుల ఆలోచనలను స్టార్టప్ దిశగా మళ్లిస్తూ.. యువ వ్యాపారవేత్తలను తయారు చేస్తున్నారీమె. చదువుకోవడానికే పెద్ద పోరాటం చేసిన ఆమె.. ఇక్కడివరకూ ఎలా వచ్చారో తెలుసుకుందాం..**

అమ్మాయి.. కష్టపడాల్సిన అవసరమే అన్న భావన ఇంట్లో. దీంతో అన్నయ్య పుస్తకాలతో ఇంట్లోనే నా చదువు సాగింది. మాది జగ్గయ్యపేట దగ్గర బండిపాలెం. నాకు 12 ఏళ్లప్పుడు నాన్న సత్యనారాయణ చనిపోయారు. అప్పుడు స్కూలు కెళతానని పట్టుపడితే ఒప్పుకొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పది వరకూ చదివా. పూర్తయ్యాక మళ్లీ 'చదువెందుకు' అన్న ప్రశ్నే! హాజరు మినహాయింపు పొంది మరీ.. ఇంటర్, డిగ్రీలో బిఎ (సోషియాలజీ) పూర్తిచేశా. నా పట్టుదల చూశాక ఇంట్లోవాళ్లు అప్పుడు మెత్తబడ్డారు. అలా ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి పిజి చేయగలిగా. సివిల్స్ లక్ష్యం కోసం ఢిల్లీకీ వెళ్లా. కానీ మాకు తోడుగా ఉన్న తాతగారు చనిపోవడంతో ఉద్యోగంలో చేరాల్సొచ్చింది. అప్పుడే టాటా ట్రస్ట్ నుంచి రూ.2 లక్షలతో ఫెలోషిప్ వచ్చింది. అయితే దీన్ని అందుకున్నవారు మూడేళ్లు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో పనిచేయాలి. దీంతో మదురైలోని 'దాన్ ఫౌండేషన్'లో చేరా. క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసెకెళ్లేవాళ్లం. మంచినీటి అవసరాలు తీర్చడం, మహిళలకు ఉపాధి వంటివన్నీ చేసేవాళ్లం. దీని సేవలు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉండటంతో హైదరాబాదుకి వచ్చా. మౌలాలిలో నా ఆధ్వర్యంలో కమ్యూనిటీ స్కూలు ప్రారంభమవడం, దానికి ప్రభుత్వ గుర్తింపూ దక్కడం మర్చిపోలేను.

**వాళ్లని చూశాక....** ఆ తర్వాత బివైఎస్‌టి, ఎర్నెస్ట్ అండ్ యంగ్‌ల్లో యూత్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ మీదా.. ఏపి ప్రభుత్వంతో డిజిటల్ గవర్నెన్స్‌పైనా పనిచేశా. 18 ఏళ్లలో దాదాపు 20వేల మంది మహిళలకు సాయపడగలిగా. వీహబ్‌లో సోషల్ ఇంపాక్ట్ ఆంత్రప్రెన్యూర్ హెడ్‌గా స్టార్టప్‌లకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంతోపాటు మెంటార్‌గా సేవలందించా. 250 స్టార్టప్‌లతో పనిచేశా. అవకాశాల కోసమని విదేశాల బాట పడుతోన్న విద్యార్థులను చూశాక దేశ భవిష్యత్తు ఎకానమీ ఏమవుతాయి అనిపించింది. వాళ్లని వ్యాపారం వైపు ప్రోత్సహించాలన్న ఇది ఏడాది కెటిఆర్ చేతుల మీదుగా 'ఫౌండర్స్ ల్యాబ్' ప్రారంభించా. రూ.4 లక్షల ఉద్యోగాన్ని వదిలి రిస్క్ చేస్తున్నావన్నా పట్టించుకోలేదు. ఏదైనా ప్రొడక్ట్ విజయవంతమైతే దానికి ఆర్థికంగా, మార్కెటింగ్‌పరంగా సాయపడే సంస్థలెన్నో, కార్యరూపం దాల్చని ఆలోచనలనూ వెలుగులోకి తీసుకురావాలన్నది మా ఉద్దేశం. అందుకే వివిధ కాలేజీలకు వెళ్లి ఒప్పందం చేసుకున్నాం.

**ఇతర రాష్ట్రాలవాళ్లూ...** ఆరోగ్యం, డిఫెన్స్, వ్యవసాయం.. ఇలా నెలకో థీమ్ ఉంటుంది. దాన్నిబట్టి విద్యార్థులు తమ ఆలోచనను మాతో పంచుకోవచ్చు. లేదా మేమే పరిశ్రమల సమస్యలను ఇచ్చి పరిష్కారాలు చెప్పమంటాం. బాగున్నవాటిని సంస్థలతో జోడిస్తాం. విద్యార్థుల్లో ఆలోచనలు ఎక్కువే. వాటినెలా బయటపెట్టాలో తెలీదు. దానికి మే వేదిక కల్పిస్తున్నాం. భిన్న రంగాల వాళ్లతో పనిచేసే వీలూ కల్పిస్తున్నాం. 250 ఆలోచనలు రూపుదిద్దుకుంటున్నాయి. 15వేల మంది విద్యార్థులు మాతో అనుసంధానమయ్యారు. ఇతర రాష్ట్రాల కళాశాలలూ సంప్రదిసుత్నన్నాయి. టీమ్‌లో భిన్న రంగాలు. భాషలకు చెందిన 12 మంది ఉన్నారు. 24 గంటలూ విద్యార్థులకు అందుబాటులో ఉంటాం. కాస్త తోడ్పాటునిస్తే మామూలు కళాశాలల నుంచీ స్టార్టప్‌లు వస్తాయని నిరూపించడమే నా లక్ష్యం. ఇన్నేళ్లలో విరామమే తెలీదు. నచ్చింది చేసుకుంటూ వచ్చా. దానికి మావారు సత్యప్రసాద్ తోడ్పాటే కారణం. నా సహాధ్యాయే! కెరియర్‌కి అడ్డురానని పెళ్లికి ముందిచ్చిన మాట కోసం పిల్లల బాధ్యతనీ తీసుకున్నారు. ఇప్పుడు ఫౌండర్స్ ల్యాబ్‌లోనూ సాయమందిస్తున్నారు. కోరుకున్న ఎంపిసి, సివిల్స్ చేయలేకపోయా. కెరియర్‌లోనూ అవరోధాలు. పరిస్థితులకు తగ్గట్టు నన్ను నేను మార్చుకున్నా. మీరూ ఆర్థిక స్వాతంత్ర్యం తెచ్చుకోండి. మీ భవిష్యత్తుని మీరే నిర్ణయించుకోండి. అదే అసలైన స్వాతంత్ర్యం దాన్ని వేరెవరూ ఇవ్వరు. మీరే సంపాదించుకోవాలి. ❑

# పొత్తికడుపులో నొప్పి నివారణకు..



**చాలామంది మహిళలకు నెలసరి** సమయంలో నొప్పి వస్తుంది. కారణం సాధారణం పీరియడ్స్ సమయంలో, నెలమొత్తం మందంగా తయారైన గర్భాశయ లోపలి ఎండోమెట్రియమ్ పొర బ్లీడింగ్ రూపంలో ముక్క ల్లాగా, పలచని పొరలాగా బయటకు వచ్చేస్తుంది. ఆ క్రమంలో అనేక కారణాల వల్ల కొందరిలో ఈ పొర గర్భాశయం నుంచి ఫెలోపియన్ ట్యూబుల ద్వారా, రక్తనాళాల ద్వారా, ఇంకా అనేక విధాలుగా పొత్తికడుపులోకి ప్రవేశించడం జరుగుతుంది. కొందరిలో అది క్రమేణా నశించిపోతుంది. కొందరిలో ఈ ఎండోమెట్రియమ్ పొర చిన్న ముక్కలుగా గర్భాశయం వెనుకభాగంలో, అండాశయాలపైన, పెల్విక్ గోడలపైన, పెరిటోనియమ్ పైన, పేగులపైన, మూత్రాశయంపైన అతుక్కుని ఉండిపోయి రక్త సరఫరాను పొంది, ప్రతినెలా పీరియడ్ సమయంలో ఈ పొరలో కూడా కొద్దిగా బ్లీడింగ్ కావడం జరుగుతుంది. దీనినే ఎండోమెట్రియాసిస్ అంటారు. కొందరిలో ఈ ఎండోమెట్రియాసిస్ అంటారు. కొందరిలో ఈ ఎండోమెట్రియమ్ పొర ముక్కలో ప్రతినెలా బ్లీడింగ అవుతూ, అది పెరుగుతూ, అది ఉన్న అవయం లోపలికి చొచ్చుకుపోతూ పెరగడం మొదలవుతుంది. దీనినే డీప్ ఇన్‌ఫ్లీజరేటింగ్ ఎండోమెట్రియాసిస అంటారు. ఇందులో భాగంగా అడినోమయోసిస్, అండాశయాల్లో చాక్లెట్ సిస్ట్‌లు,పేగులు, గర్భాశయం ట్యూబులు, అండాశయం దగ్గరకు వచ్చి అతుక్కుపోవడం వంటి సమస్యలు ఏర్పడతాయి. ఇందులో లక్షణాలు ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటాయి. కొందరిలో పీరియడ్స్ సమయంలో విపరీతమైన కడుపునొప్పి, కలయికలో నొప్పి, నడుం నొప్పి, పొత్తికడుపులో నొప్పి, అధిక రక్తస్రావం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు వంటి సమస్యలు ఏర్పడవచ్చు. కొందరిలో అసలు ఏ లక్షణాలూ ఉండవు. వేరే సమస్యకు లాపరోస్కోపీ వంటి ఆపరేషన్లు చేసినప్పుడు మాత్రమే సమస్య ఉన్న విషయం బయటపడుతుంది. నెలసరిలో నొప్పి రావడానికి ఎండోమెట్రియాసిస్ ఒక్కటే కారణం కాదు. గర్భాశయంలో ఫైబ్రాయిడ్స్ ఉన్నా, ఇన్‌ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ డిసీజ్ (పిడిఐ) ఉన్నా, ఇంకా వేరే కార ణాల వల్ల కూడా కావచ్చు. కొందరిలో ఏ సమస్యా లేకపోయినా పీరియడ్స్ సమయంలో ప్రోస్టోగ్లాండిన్స్ అనే హార్మోన్స్ ప్రభావం వల్ల గర్భాశయం కుంచించుకు న్నట్లయి, ఎండోమెట్రియమ్ పొరకురక్త ప్రసరణ తగ్గి, బ్లీడింగ్ రూపంలో బయటకు వస్తుంది. ప్రోస్టోగ్లాండిన్స్ విడుదలయ్యే మోతాదును బట్టి పీరియడ్స్ సమయంలో నొప్పి తీవ్రత ఒక్కొ క్కరిలో ఒక్కోలా ఉంటుంది. కాబట్టి మీ అంతట మీరే ఏదో ఊహించేసుకోకుండా ఒకసారి డాక్టర్‌ను సంప్ర దించి, కారణం తెలుసుకోవడానికి స్కానింగ్ వంటి పరీక్షలు చేయించుకుని, సమస్య ఏమీ లేకపోతే, నొప్పి మరీ ఎక్కువగా ఉంటే ఆ రెండుమూడు రోజులునొప్పి నివారణ మందులు వాడుకోవచ్చు. ❑

# అమ్మకు దగ్గరగా..





అమ్మ అయిన వేళ ఎనలేని ఆనందం మనది. అంతే బాధ్యతలూ పెరుగుతాయి మరి. ఇంటి పని, పిల్లలని చూసుకోవడం రెండూ ఏకకాలంలో చేయడం కొంచెం కష్టమైన పనే. కానీ ఈ 'బేబీ హుడీ క్యారియర్స్' మీ దగ్గర ఉంటే పిల్లల్ని ఎక్కడికైనా తీసుకెళ్లడం తేలిక. మీరు ధరించే దుస్తుల్లోనే వాళ్లనీ చక్కగా పొదువుకోవచ్చు. ఎండ, చలిబాధ లేకుండా బుజ్జాయిలకుప్రత్యేకమైన హుడీ ఏర్పాటు కూడా ఉంటుంది.






# దానిమ్మ తొక్కలతో లాభాలు..

పండ్లు తిన్న తర్వాత సాధారణంగా తొక్కలను పారేస్తుంటాం. కానీ ఆ తొక్కల్లో ఫైబర్, విటిన్స్, యాంటిఆక్సిడంఎట్లు పుష్కలంగా ఉంటాయన్న విషయం చాలామందికి తెలియదు. దానిమ్మ పండు విషయానికి వస్తే.. దానిమ్మ గింజలు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అనారోగ్యంతో ఉన్నవారికి దివ్య ఔషధం దానిమ్మ.

**మెండుగా యాంటీ ఆక్సిడెంట్లు...** ◆ దానిమ్మ తొక్కల్లో ఉండే అధిక యాంటీ ఆక్సిడెంట్లు హార్ట్ ఎటాక్ రిస్క్‌ను తగ్గిస్తుంది. శరీరంలో పేరుకు పోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.



◆ చర్మ క్యాన్సర్‌ని తగ్గించడంలో దానిమ్మ తొక్కలు బాగా పనిచేస్తాయి. హానికరమైన యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షిస్తుంది. దానిమ్మ తొక్కలతో పొడి చేసుకొని దాన్ని ముఖానికి అప్లై చేసుకుంటే ముఖం చాలా కాంతివంతంగా మెరిసిపోతుంది.
◆ దానిమ్మ తొక్కలో గ్లైసెమిక్ ఇండెక్స ఉండటం వల్ల చక్కెర స్థాయిలను తగ్గించి బరువును కంట్రోల్‌లో ఉంచేలా చేస్తుంది.
◆. దానిమ్మ తొక్కలో అధికంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి కాబట్టి తొక్కలను శుభ్రంగా కడిగి రసం తీసి తాగితే ఆరోగ్యానికి మంచిది.
◆. కప్పు నీటిలో టీస్పూను దానిమ్మ పొడి అరచెక్క నిమ్మరసం వేసి తాగినా మంచిదే.

**దానిమ్మతో అందం, మొటిమలు మాయం..**

◆ టేబుల్‌స్పూను దానిమ్మ పొడిలో అరటేబుల్ స్పూను నిమ్మరసం అరటేబుల్ స్పూను తేనె వేసి చక్కగా కలపాలి ఈ మిశ్రాన్ని ముఖం మెడ చేతులకు స్క్రబ్బర్‌లా రుద్ది కడగాలి. ఈ స్క్రబర్ వల్ల మృతకణాలు ట్యాన్ తొలగి ముఖ చర్మం మృదువుగా మారుతుంది.
◆ దానిమ్మ తొక్కలు మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇందుకోసం ఏం చేయాలంటే దానిమ్మ పొడిలో కొన్ని నీళ్లుపోసి మెత్తని పేస్టులా చేసుకొని ముఖానికి అప్లై చేసుకోవాలి. నిమిషాల తర్వాత చల్లని నీళ్లతో కడిగేయాలి ఇలా తరచూ చేస్తుంటే మొటిమల సమస్యతగ్గిపోతుంది.
◆ వయస్సు రీత్యా వచ్చే ముడతలను కూడా దానిమ్మ తగ్గస్తుంది. ప్రతిరోజై ఈ పొడిని రాసుకుంటే మార్పు మీకే కనిపిస్తుంది.
◆ కొబ్బరినూనెలో దానిమ్మ తొక్కలను కలిపి వేడిచేసి చల్లారాక తలకు పట్టించాలి. నిమిషాల తర్వాత స్నానం చేస్తే చుండ్రు పూర్తిగా తగ్గిపోతుంది.
◆ దానిమ్మ తొక్కలు చర్మం సమతుల్యం చేస్తుంది తేమగా ఉంచుతుంది.
◆. చర్మ కణాలనుపునరుత్పత్తి చేస్తుంది. హానీకరమైన యూవీ కిరణాల నుంచి రక్షిస్తుంది. ❑

# గుడ్డు పెంకులతో ప్రయోజనాలు..

**పౌష్టికాహార లోపంతో** బాధపడేవారిని తినమని సూచించే మొదటి ఆహారం గుడ్డు. దీంతోనే కాదు.. వృథా అనుకుని పారేసే దాని పెంకులతోనూ బోలెడు ప్రయోజనాలున్నాయి. **అవేంటంటారా?**

ఈ కాలంలో పూజలూ, వేడుకలూ కాస్త ఎక్కువే. ఈ సందర్భానికి బయటకు తీసిన వెండి వస్తువుల్నీ, బంగారు నగల్నీ, ఇత్తడి సామగ్రినీ.. గుడ్డు పొడితో తోమచ్చు. ముందుగా పెంకుల్ని పౌడర్‌గా చేయాలి. ఆపై దానికి కాస్త వెనిగర్, నీళ్లు కలిపి.. వస్తువులకు పట్టించి పదినిమిషాలయ్యాక బ్రష్‌తో రుద్దితే కొత్తవాటిలా మెరిసిపోతాయి.

- గుడ్డు పెంకుల్ని పొడి చేసి ఓ కప్పులో వేయండి. వాటికి క్తా నిమ్మరసం చేర్చి మూత పెట్టేయాలి. ఇలా ఓ రెండు రోజులు వదిలేస్తే అవి కరిగిపోతాయి. ఇప్పుడు వాటిని లీటరు నీటిలో కలిపి మొక్క చుట్టూ మట్టిలో కలిపితే సరి. ఇందులోని క్యాల్షియం కార్బొనేట్‌తో పాటు ఇతర ఖనిజాలూ అంది ఆకులు పచ్చగా, పువ్వులు నిండుగా వస్తాయి. చీడపీడలూ దరిచేరవు.
- గారపట్టిన పాలరాతి సింకులూ, ఫ్లోర్‌ని గుడ్డు పెంకులతో శుభ్ర పరచొచ్చు. వీటిని పొడి చేసి రెండు చుక్కల ద్రవరూప సబ్బుని చేర్చి పేస్ట్‌లా చేయాలి. దానికి కాస్త బేకింగ్ సోడా కూడా చేర్చి మరకలు పడ్డ చోట రాసి ఓ అరగంట వదిలేయండి. తర్వాత బ్రష్‌తో కడిగితే తెల్లగా తళతళలాడతాయి.



# విశిష్టత



**పరమ శివునికి అత్యంత** ప్రీతి పాత్రమైనది ఈ కార్తీక మాసం భక్తి శ్రద్ధలతో ఈ మాసంలో ఉపవాసం దీక్ష ఉంటే మంచిది. ప్రతీ సోమవారం కార్తీక సోమవారం నాడు శివాలయాలలో ప్రత్యేక పూజలు చేస్తారు సోమవారం శివునికి అత్యంత ప్రీతికరం కనుక స్త్రీలు ఈ మాసంలో కార్తీక దీపాలు పెడతారు. వాటిని పూజించి గంగలో కార్తీక దీపాలు విడిచి పెడతారు ఇలా చేయడం వలన సకల సౌభాగ్యములు సిద్ధిస్తాయని ప్రతీతి. ఈ మాసంలో ఉదయాన్నే లేచి శివరాధన, శివదర్శనం చేసుకోవాలి. 'ఓమ్ నమ శివాయ' అనే నామస్మరణ ప్రతి నిత్యం చేయాలి. లింగాష్టకం, శివార్చన, శివస్తుతి పారాయణం చేయాలి. దగ్గరలో వున్న శివాలయం దర్శంచుకోవాలి. పరమ పవిత్రమైనది ఈ కార్తీక మాసంలో పుణ్య కార్యములు చేయాలి. శివునికి ఈశ్వ రుడు, రుద్ర, ముక్కంటి, జటా జూఠధారి, శివోహం, త్రినేత్రుడు, ఈశ్వరుడు, అంటూ అనేక నామధేయాలు శివునికి వున్నాయి. శివారాధనలో భక్తి ప్రధానము ఈ కార్తీక మాసంలో పూజించడం, శివలింగంనకు అభిషేకములు, అర్చనలు చేయాలి కార్తీక మాసంలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తారు. భోళాశంకరుడు అయిన పరమశివుడుని ప్రసన్నం చేసుకోవడానికి కార్తీక మాసం విశిష్టత కలది కనుక ప్రతీ ఒక్కరూ ఈ కార్తీక మాసం నియమ నిబంధనలు పాటించాలి భక్తి శ్రద్ధలతో శివరాదన పాటిస్తే సకల శుభములు కలుగుతాయి. పరమ శివుడుకి ఇష్టం అయిన మాసం ఈ కార్తీక మాసం ఈ మాసంలో శ్రీ సత్యనారాయణ వ్రతం చేసినా పుణ్యఫలం చేకూరుతుంది. భక్తి శ్రద్ధలతో కార్తీక మాసంలో శివ దీక్షలు చేసిన వారికి పుణ్యఫలం సంప్రాంప్తిస్తుంది. కార్తీక మాసం ప్రారంభంలోనే శివ దీక్షలు కూడా ప్రారంభించిన అనంతరం శివ నామస్మ రణతో శివాలయాలు కిటకిటలాడు తాయి. పుణ్యప్రదమైన మాసం, కార్తీక మాసం.

ఆధ్యాత్మికం

# రొమ్ము కేన్సర్ తగ్గించే సైక్లింగ్

కసరత్తులు కష్టంగా కాకుండా.. కాస్త సరదాగానూ ఉండాలని కోరుకుం టారు కొందరు. ఆలాంటి వారికి సైక్లింగ్ చక్కటి సాధనం. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి సరదాగానూ చేసేయొచ్చు. దృఢంగా ఉండొచ్చు.

- కాస్త విసుగ్గా ఉన్నప్పుడు సైక్లింగ్ చేస్తే.. క్షణాల్లో చిరాకు మాయమై మనసంతా హాయిగా ఉంటుంది. సైకిల్ తొక్కుతున్నప్పుడు మెదడులో విడుదలయ్యే డోపమైన్ అనే హార్మోన్ మనసుని ఉల్లాసంగా ఉంచుతుంది. శక్తీని అందిస్తుంది.
- ఒక వయసుకు వచ్చేసరికి మహిళల్లో ఎముకలు బలహీనంగా మారతాయి. దాంతో కీళ్ల నొప్పులూ ప్రారంభ మవుతాయి. సైకిల్ తొక్కడం వల్ల మోకాళ్లు మోచేతులు, ముంజేతుల దగ్గరి ఎముకలుచురుగ్గా, దృఢంగా మారతాయి. అంతేకాదు రక్త పోటును అదుపులో ఉంచుతుంది.
- సైకిల్ తొక్కడం వల్ల శరీరం మొత్తానికి రక్త ప్రసరణ సక్రమంగా సాగి శరీరంలోని అన్ని భాగాలకూ సరిపడినంత ఆక్సిజన్ అందుతుంది. మెనోపాజ్ ముందూ తరువాత దశల్లో రొమ్ము కాన్సర్ బారిన పడకుండా కాపాడుతుంది.
- ఎలాంటి ఒత్తిడికీ గురి కాకుండా అధిక బరువును తగ్గించుకోవడానికి సైక్లింగ్ తోడ్పడుతుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయులను నియంత్రిస్తుంది. అంతేకాదు శరీరమూ చురుగ్గా మారుతుంది. ❑

## ప్రజల మేలు కోసమే టైకూన్ రోడ్డును తెరవమన్నాను

7వ పేజీ తరువాయి..

వాహనచోదకులకు ఇబ్బందదిగా మారిందని ఇక్కడ సమీపంలో నిర్మాణంలో ఉన్న తన వెంచర్ వాస్తు కారణంగా రోడ్డును తానే మూయించాను అంటూ కొన్ని రాజకీయ పార్టీల నేతలు ఆరోపణలు చేయడం అవివేకమని విమర్శించారు. అదే విధంగా చాలా దూరం వెళ్లి టైకూన్ కు ఫ్రీ లెఫ్ట్‌కు తిరిగి రావడం వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఉన్న 3-వే జంక్షన్ కు సాధారణ ప్రజలు అలవాటు పడ్డారని కనుక యాధివిధిగా రోడ్డు జంక్షన్ ను పునరుద్ధరించాలని తెలిపారు. కనుక ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డును తెరవాలని ప్రజల అభ్యర్థనను దయతో పరిగణలోకి తీసికొని టైకూన్ జంక్షన్ వద్ద మునుపటి 3వే ట్రాఫిక్ వ్యవస్థను పునరుద్ధరించడానికి అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని పత్రికాపూర్వకంగా ఓ ప్రకటనలో తమ కార్యాలయం విశాఖ లాసెన్‌స బే కాలనీ నుంచి ఒక ప్రనకటనలో డిమాండ్ చేశారు.

## 117వ ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహణ

విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బీఐఏసీ) తన ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా నేడిక్కడ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 500 మంది హాజరు కాగా 350 మందికి కంటి చూపు పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఉచిత కంటి వైద్య శిబిరంలో 237కి ఉచిత అద్దాలను అందించి మిగతా 109మందికి మందులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా 40మంది కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. మిగిలినవారికి డిసెంబర్ 24న జరిగే 118వ శిబిరానికి టోకెన్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక, పలహారాలు, భోజనం సదుపాయం కల్పించడం జరిగింది. ఈసందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్ నర్ దోరసా ్వమి ఈకార్యక్రమం గురించి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రం బ్రాండ్క్స్ ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యం అని అన్నారు.

## లక్కీషాపింగ్ మాల్‌లో ఫెస్టివల్ ఆఫర్స్

విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

లక్కీ షాపింగ్ మాల్‌లో క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఫెస్టివల్ ఆఫర్స్ ను సినీతార అనసూయ లాంచ్ చేశారు. ఆదివారం జగదాంబ జంక్షనలో ఉన్న లక్కీ షోరూమ్ కి హాజారై సందడి చేశారు. ముందుగా విశాఖ ప్రజలకు అభివాదం చేస్తూ కాసేపు ముచ్చటించారు. షోరూం బయట ఏర్పాటు చేసిన స్టేజిపై అనసూయ స్టెప్పులు వేస్తూ అదరగొట్టారు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 12ఏళ్లుగా వైజాగ్ లోని విశాఖ ప్రజల మన్ననలు పొందుతున్న లక్కీ షాపింగ్ మాల్ లో పండుగ లో సరికొత్త ఆఫర్స్ తీసుకువచ్చిందన్నారు. చిన్నారుల నుంచి మగువుల వరకు అద్భుతమైన డిజైన్లు కలెక్షన్లు అందు బాటులో ఉంచారాన్నారు. షోరూమ్ అధినేతలు రత్తయ్య, శ్రీను స్వామి మాట్లాడుతూ 12సంవత్సరాలు గా ఆదరిస్తున్న విశాఖ ప్రజలకు గివింగ్ బ్యాక్ ఉద్దేశంతో ఉమెన్స్ వేర్ లేడీస్ వేర్, జెంట్స్ వేర్, కిడ్స్ వేర్ ఇలా ఫ్యామిలి వేర్ అన్ని విభాగాలలో అదిరిపోయే ఆఫర్స్ ను అందిస్తున్నామని చెప్పారు. పెస్టివల్ సీజన్ వలన షోరూం ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అంతే సుంరమైన ఆఫర్స్ ను ప్రజలకు అందుబాటుధరలలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం షోరూమ్‌లో మూడంతస్తుల్లో అందుబాటులో ఉంచిన కలెక్షన్ లు పరిశీలించారు సందడి చేస్తూ ఆకట్టుకున్నా చీరలను ప్రదర్శించి ఫోజులిచ్చారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈప్రారంభోత్సవంలో జీవీఎంసీ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కంకటాల మల్లిక్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నౌకాదళ విన్యాసాలు

విశాఖసిటీ, డిసెంబర్ 10, ప్రభాతవార్త



సముద్ర రక్షకుల శక్తి సామర్థ్యాలను చాటి చెప్పాయి . నీటిలోను... నింగిలోను...నేలపైనైనా సమరానికి సై అంటూ సైనికులు చేసిన విన్యాసాలె ఔరా అనిపించాయి. నేవీ డే సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆర్‌కే బీచ్‌లో భారత నౌకాదళం ప్రదర్శించిన సాహస ప్రదర్శనలు చూపరులను కనువిందు చేశాయి. సుమారు 4.52 గంటలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ వేదికపైకి రావటంతో జాతీయగీతం ఆలపన చేయటంతో కార్యక్రమం ప్రారంభం కావటంతో అంతా నిల్చొని వందనం చేశారు. అదే సందర్భంలో సముద్రంలో పేల్చిన హాక్ బాంబు త్రివర్ణాలను నీటి నుంచి పైకి ఎగజిమ్మి జాతీయ పతాకం ఉవ్వెత్తున ఎగిసిందా అనిపించేలా చేశాయి. అనంతరం సబ్‌మెరైన్ సెయిల్ పాస్ట్ నిర్వహించారు అదేసమయంలో ఎస్ఎస్‌సి కేర్ద్ విద్యార్థులు హార్న్ పైప్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. మార్కోస్ డెమో స్టీ ఆప్స్ యుద్ధ విమానాలు సీరింగ్ హెలికాప్టర్లలో వచ్చిన మెరైన్ కమెండోలు సిబ్లింగ్ ఆపరేషన్ నిర్వహించి తిరిగి అదే హెలికాప్టర్ నుంచి తాడుతో వేలాడుతూ జాతీయ పతాకాన్ని గాలిలో ఆడిస్తూ వెళ్ళారు. జెమినీ బోట్లు పై దిగిన డైవర్లు , మెరైన్ కమెండోలు తీరాన మాటువేసిన శత్రు మూకలను అదుపులోకి తీసుకొని వెళ్లడం తో ఇసుకలో బంకర్లు దట్టమైన పొగలను విడుదల చేస్తూ శత్రువులకు యుద్ధవీరులు ఎక్కడ ఉన్నారో తెలియకుండా దట్టమైన పొగలు విడుదల చేస్తూ అటుఇటు తిరిగిన సమయంలో బంధీగా ఉన్నా శత్రువులను జీపులో వెక్కించుకొని అక్కడ నుండి సురక్షత స్థలానికి చేర్చడం తో పాటు అక్కడ ఆయిల్ బాంబును పేల్చడంతో శత్రువులను బయభ్రాంతులను గురిచేసి తమ సత్తా చాటుకున్నారు. మెరైన్ కమెండోలు అత్యంత నైపుణ్యంతో స్కై డైవింగ్ చేస్తూ పారాచూట్లు సాయంతో వేదిక వద్ద దిగే అందులో ముందుగా దిగిన వీరుడు గర్నర్‌కు జ్ఞాపికను అందజేశారు. ఈ విన్యాసం అందరినీ కళ్లార్పకుండా చేసింది. సముద్రంలో సమరానికి వెళుతున్నట్లుగా బకదానితరువాత మరోకటి వేగంగా కదులుతూ వెళ్లిన యాంటీ సబ్‌మెరైన్ , వార్‌ఫేర్ నౌకలు విన్యాసాలు , ఆకాశం దద్దరిల్లేలా చేశారు. సముద్రంలో నేవీ విమానాలు దశాలు ఆకాశం దద్దరిలేలా దిక్కులు పిక్కటిల్లేలా విన్యాసాలు ప్రదర్శించాయి. హాక్ యుద్ధ విమానాలు , చేతక్ హెలికాప్టర్లు , మిగ్ విమానాలు బోయింగ్ విమానాలు ప్రత్యేకతలు చాటాయి. సముద్రంలో దూసుకొని వెళ్ళుతున్నా యుద్ధనౌకలపైకి నాలుగు హెలికాప్టర్లు అదే వేగంతో ల్యాండ్ కావడం తిరిగి అక్కడ నుండి గాలిలోకి లేచి వెళ్ళిపోవడం వారి నైపుణ్యతకు అర్థం పట్టింది, సాహస విన్యాసాల ప్రదర్శన ముగిసిన తరువాత నేవీ బ్యాండ్‌తో సంగీతం సాయంసధ్యలో మరోసంగీతంతోపాటు జాతీయ పతాకం,నేవీ పతాకం ను నెమ్మదిగా అవనతం చేసారు. అనంతరం విద్యుత్ దీపాలు వెళిగించిన అనంతరం సముద్రంలో ఉన్నా యుద్ధనౌకలు అన్నికూడా విద్యుత్ దీపాలాను వెలిగించారు. తరువాత యుద్దనౌకలలో నుండి పెద్ద గన్‌లతో పెల్చిన బాంబూలతో వచ్చిన ధ్వని చెవ్వులు రింగ్ మనిపించే ఉంది.

## ఎమ్మెల్యే గణేష్ అవినీతి వల్లే వైసీపీకి రాజీనామా

7వ పేజీ తరువాయి..

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ గృహాలు కేటాయించడంలో తన అనుచరుల చేత డబ్బులు వసూలు చేస్తున్నారని ఆలయాల చైర్మన్ ల పోస్టుల కోసం పోలీస్ రెవెన్యూ ఉద్యోగుల బదిలీల కోసం వాసుపల్లి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపించారు. వాసుపల్లి గణేష్‌కుమార్ వలన ఇబ్బంది వుందని పలు మార్లు అధిష్టాన వర్గం దృష్టికి ఉత్తరాంధ్ర సమన్వయ కర్త వై.వి.సుబ్బారెడ్డి కి తెలియజేసిన పట్టించు కోలేదన్నారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆశీస్సులతో వైసీపీ లో చేరానని గుర్తు చేశారు. దక్షిణ నియోజకవర్గం పాత నగరం అభివృద్ధికి సాయిరెడ్డి సహకారం ఎంతో వుందని ఈసందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కానీ ఎమ్మెల్యే గణేష్‌కుమార్ వల్ల పార్టీ క్యాండర్ ఇబ్బంది పడుతున్నారన్నారు. తాను ఏ పని కోసం జీవీఎంసీలో లేఖలు ఇస్తే ఆ పనులు జరగకుండా ఎమ్మెల్యే వసుపల్లి తనను టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపైతాను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన వైసీపీ అధిస్టాన వర్గం స్పందించడంలేదని అందుకనే వైసీపీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన అనుచరులతో చర్చించి రాజకీయ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని అన్నారు. నియోజకవర్గం లో రెండు సార్లు ముస్లిం ఎమె ్మల్యేలు పని చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో మండల సభ్యులు, ఇంచార్జి పోస్టుల్లో ముస్లింలు లేరని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యునిగా పోర్టు అధికారులు కంపెనీలతో సమావేశాలు జరిపి కార్గో హా ్యండ్లింగ్ విషయములో అవసరం అయిన చర్యలు చేపట్టామని ఒకప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నియోజకవర్గంలో మిగిలిన వైసీపీ కార్పొరేటర్లు కూడా రాజీనామా చేసే అవకాశం వుందన్నారు. సమావేశంలో పలువురు సాధిక్ అనుచరులు పాల్గొన్నారు.

## ఘనంగా కెకెఆర్ ట్రోఫీ ముగింపు

విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త , రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు జన్మదినం సందర్భంగా విశాఖ డిస్ట్రిక్ట్ ఆమెటూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడవ సంవత్సరం డిస్ట్రిక్ట్ మెన్ అండ్ ఉమెన్ సబ్ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ 2023 కైలాసపురం పోర్ట్ హాస్పిటల్ ఎదురుగా గత మూడు రోజులుగా జరుగుచు ఆదివారం ఫైనల్స్ జరిగినవి మేన్స్ అన్ని విభాగాల్లో కలిపి ఫైట్స్ జరుగగా క్లబ్ అధ్యధిక విభాగాల్లో గెలిచి ప్రథమ విజేతలుగా ఎస్‌టిసి సాయి విశాఖ నిలువగా రన్నర్లుగా లక్కీ బాక్సింగ్ క్లబ్ వారు రన్నర్స్ ట్రోఫీ అందుకున్నారు. ఈకార్యక్రమంకు ముఖ్య అతిధులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె కె రాజు పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనుక్, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము, కామేశ్వరి కార్పొరేటర్లు, కె అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, కె వి యన్ శశికళ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, 26వ వార్డు ఇంచార్జి పీలా వెంకటలక్ష్మి ద్రోణంరాజు అవార్డు గ్రహీత ఐ వెంకటేశ్వర్లు ఏపీ స్టేట్ బ్యాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ బి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిపురం కూడలిలో అడ్డుగోడలు తొలగించాలని మహాధర్నా

### - జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాఖసిటీ డిసెంబర్ 10, ప్రభాతవార్త



జనసేన పార్టీ ప్రజలకోసం పోరాటం చేస్తుదని జీవిఎంసీ వైఖరి వలన సిరిపురం టైకూన్ హోటల్ వద్ద మూసివేసిన కూడలి తెరవాలని సోమవారం మహాధర్నా నిర్వహింస్తున్నాట్లు జీవిఎంసీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. ఆదివారం జీవిఎంసీ గాంధీ విగ్రహం వద్ద జనసేన ఆధ్వర్యంలో విలేకరుల సమావేసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం విశాఖ ఎంపీవీ కొట్టేసిన ఆస్తులకు వాస్తుదోషమని మూసేసిన కూడలి కి తమ అధినేత పవన్‌కళ్యాణ్ కూడా పరిశీలించారని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్కూల్ కి విద్యార్థులకు దింపాలంటే ఇబ్బందులు , ఎరియిపోర్టు కి వెళ్ళుతున్నా సమయంలో కూడా ఇబ్బంది పడుతున్నారని చెప్పినా జీవిఎంసీ అధికారులు , పోలీసులు, అధికారులు పట్టించుకోకపోవటంతో ధర్న నిర్వహించామని అన్నారు. శనివారం జరిగిన ధర్నాలో పోలీసులు తమ జనసైనికులను అరెస్టులు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తమ నాయకులు నాదేండ్ల మనోహార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తూన్నామని ఈ ధర్నాలో పార్టీలకు అతీతంగా చేస్తూనా ్నమని అన్ని పార్టీల నాయకులు తోపాటు తమ పార్టీ నాయకులు కూడా పాల్గోంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పివిఎస్ఎన్ రాజు, పసుపులేటి ఉషాకిరణ్, లక్ష్మి,తదితరులు పాల్గోన్నారు.

## విమర్శలకు కట్టమంచి రచనలు దోహదం

విశాఖసిటీ, డిసెంబర్ 10, ప్రభాతవార్త




ఆధునిక సాహిత్య విమర్శ ప్రస్థానంలో విప్లవాత్మకంగానూ తెలుగు సాహిత్య విమర్శను రాబోయే తరాల వారికి అందుబాటులోకి వచ్చే విధంగాను బాటలు వేస్తూ సాహిత్య రంగంలో సరికొత్త భావాలకు , నూతన ఆలోచనా రీతులకు మనోవికాసాత్మకమైన విమర్శలకు కట్టమంచి రామలింగారెడ్డి దోహదపడ్డారని వక్త మాట్లాడారు. విశాలాంధ్ర విశాఖ 22 పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఆరసం, ఆచార్య చందు సుబ్బారావు, లిటరరీ, అండ్ కల్చరల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్యం విమర్శ అంశంపై జరిగిన సాహిత్యసభలో ఆచార్య కెఎస్‌చలం ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య వెలమల స్మిన్నలు పాలోగన్నారు.ఒక వైపు తెలుగు కవితను మరో వైపు కవితా విమర్శను నూతన శోభతో కొత్తకాంతులతో ఆవిష్కరించిన సాహితీమూర్తి కట్టమంచి అని సంభాషణలతో దెబ్బకు దెబ్బ తీయగల నేర్పు వాదనాచాతుర్యం తన శైలి అని అన్నారు. హాస్య ప్రియత్వం, ఛలోక్తులు, చమత్కార సంభాషణా నైపుణ్యం వంటి లక్షణాలతో అందరిరీ ఆకట్టుకునే వారు రామలింగారెడ్డి అని కొనియాడారు. సాహితీవేత్తగా , వక్తగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా, రాజనీతిజ్ఞుడిగా, అనేక రంగాల్లో తెలుగునాట తనదైన ముద్రవేశారని గుర్తుచేశారు. గత శత వసంతాల తెలుగు సాహిత్య ప్రస్థానాన్ని గురించి ఆలోచించేటప్పుడు మొట్టమొదటిగా మనసులో మెదిలో కొద్ది మంది వైతాళికుల్లో కట్టమంచి రామలింగారెడ్డి ఒక్కరని పేర్కొన్నారు.ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖలో నెలకొల్పడంతో కట్టమంచి విశేష కృషి చేశారన్నారు. ఆరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజరు పి.ఎరాజు, బండి సత్యనారాయణ, అడపా రామకృష్ణ , శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం

జగదాంబ, డిసెంబర్ 10, ప్రభాతవార్త



మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బివి ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోని, ఇంటరేవీషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బుల్లయ్యకళాశాలలోని గాంధీసెంటర్ సెమినార్ హాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఇజ్రాయిల్..పాలిస్తాన్ యుద్ధంలో అసువులు బాసిన ఎరికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంస్థ చైర్మన్ నరవప్రకాశరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ పదిన ప్రపంచ మానవ హక్కుల దినంగా ప్రకటించిన నేపథ్యంలో సభ్య దేశాలు భారతదేశంతోసహా జరుపుకొంటారన్నారు.నేఇకి 75 ఏళ్ళు పూర్తి అయి, నేటికి ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయన్నారు. దీనికి నిదర్శంగా ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధమే నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమంలో వక్తలుగా ఆచార్య పిడి.సత్యపాల్, విశాఖ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లిరాంబాబు,హక్కుల క్యాకర్త డాక్టర్ ప్రియాంక గంగారపు , కన్సర్న్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పికె జోష్ మాట్లాడుతూ ప్రతి మనిషి పుట్టుకతోనే మానవహక్కులు లభిస్తాయని, వాటిని కాపాడుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో హరగోపాల్, హుస్సేన్, డాక్టర్ బాబ్జి, సత్యవతి, ప్రజ్ఞాన్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతికోసం కృషిచేయాని ప్రతిజ్ఞ చేసారు.

## మానవహక్కులు సామాజిక మనుగడకు ఉపకరిస్తాయి

జగదాంబ, డిసెంబర్ 10,ప్రభాతవార్త



మానవ హక్కులు సామాజిక మనుగడకు మార్గం చూపుతాయని జాతీయ అవార్డుగ్రహీత డా.మణిభూషణ్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్, జాతీయస్థాయి ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ రేణుమీరాని సమక్షంలో జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా సంస్థలో సభ్యత్వం తీసుకున్నారన్నారు.ఈ సందర ్భంగా రేణుమీరాని మాట్లాడుతూ డా.మణిభూషణ్ విన్నూత్నమైన కార్యక్రమాలతో ఎంతో మందికి సేవచేస్తు ఎన్నో అవార్డులు పొందారన్నారు. ఇప్పటి నుండి మణిభూషణ్‌ను 'ఉత్తరాంధ్ర మెట్రో రీజియన్ కమ్యూనికేషన్ ఆఫీసర్'గా తమ సేవలు అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సంస్థకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మణభూషణ్ మాట్లాడుతూసామాజిక మనుగడకు మానవ హక్కులు ఎంతో సహాయకారిగా ఉంటాయన్నారు. ప్రతి మనిష తన సామాజిక భాధ్యలు, మానవ హక్కులు ద్వారా తెల్సుకోవచ్చన్నారు. సంతోషకరమైన జీవితం కావాలంటేమన హక్కులు పాటిస్తే అందరు ఆనందమైన జీవన మనుగడ సాగించవచ్చన్నారు.ఈ సందర్భంగా చిన్నపిల్లాల స్థాయి నుండి మానవ హక్కులపై అవగాహ కార్యక్రమాలు రూపొందించి ప్రతి విద్యార్థి సావజిక భాధ్యతనెరిగే భావి

## బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి

### -జాతీయ బిసి సంక్షేమ సంఘం



విశాఖపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

దేశంలోనూ రాష్ట్రం లోనూ సంఖ్యాపరంగా అత్యధికంగా వున్న బీసీ సామాజిక వర్గాలు రాజా ్యధికారం దిశగా ముందుకు సాగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్ టర్ లాకా వెంగళరావు యాదవ్ విశాఖజిల్లా అధ్యక్షులు డబ్బీరు కుమారస్వామి ఉద్ఘాటించారు ఆదివారం నగరంలో ఒక హోటల్ లో జరిగిన ఆత్మీయ ఆహ్వాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనూ దేశంలోనూ అత్యధిక సంఖ్యలో వున్న బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందలేదని ఆందోళన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మరో స్వాతంత్ర్యపోరాట రథ యాత్రను ప్రారంభిస్తామన్నారు. ఈ రథ యాత్ర రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో 40రోజుల పాటు సాగుతుందన్నారు. రాష్ట్రంలోని బీసీలకు 90 సఅసెంబ్లీ 13పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో 275పార్లమెంట్ స్థానాలు కేటాయించా లన్నారు. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన మహిళా రిజర్వేషన్ల బిల్లులో బిసి మహిళలకు మహిళా సబ్ కోటా కల్పించాలన్నారు. సంఘం జాతీయ కన్వీనర్ వై నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బీసిల రాజ్యాధికార మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర లో బిసి నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బిసి మహిళా అధ్యక్షురాలు వై నూకాలమ్మ, విశాఖ జిల్లా అద్యక్షులు డబ్బీరు కుమారస్వామి, యాదవ్ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, సంఘ నాయకులు బిసి యువత పాల్గొన్నారు.తరంగా రూపొందించే దిశగా డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి సేవలందిస్తానన్నారు.

## గవర్నర్‌కి ఐఎన్ఎస్ డేగలో ఘన స్వాగతం

విశాఖసిటీ డిసెంబర్ 10, ప్రభాతవార్త



రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగాలో ఘన స్వాగతం లభించింది. విశాఖపట్నంలో జరిగే నేవీడే వేడుకల్లో ముఖ్య అతిధిగా హాజరయ్యేందుకు ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఐఎన్ఎస్ డేగా చేరుకున్న రాష్ట్ర గవర్నర్కు నగర మేయరు గొలగాని హరివెంకట కుమారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున, డీసీపీ ఆనంద్‌రెడ్డి ,రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్చాలు అదజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా తూర్పు నావికాదళ అధికారి వైస్ అడ్మిరల్ రాజేష్‌పెండార్కర్ పుష్పగుచ్చం ఐఎన్ఎస్ దేగాలో అందజేశారు.

## నేడు పేటలో అడుగుపెడుతున్న నారా లోకేష్

నక్కపల్లి/ పాయకరావుపేట,డిసెంబర్10. ప్రభాతవార్త:

ప్రతిష్టాత్మకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం సాయంత్రం ఉత్తరాంధ్ర ముఖద్వారమైన అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో అడుగుపెట్టనున్నారు. తుఫాను కారణంగా నిలిచిపోయిన పాదయాత్ర నేటికి పాయకరావుపేటకు చేరనున్నది. ఇందుకు సంబంధించి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగలపూడి అనిత నాయకత్వంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో సోమవారం గొల్ల అప్పారావు సెంటర్ వద్ద సోమవారం మధ్యాహ్నానికి పూర్తిచేసుకొని పాయకరావుపేట ముఖద్వారం పాండురంగ దేవస్థానానికి చేరుకొని పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్ర కొనసాగుతుంది. ఈ పాదయాత్రకు సంబంధించి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత పార్టీ జిల్లా పెద్దలతో కలసి ఏర్పాట్లు పెద్దఎత్తున చేస్తునా ్నరు. నారా లోకేషన్ పాదయాత్ర పాయకరావుపేట నియోజకవర్గానికి చేరుతుందని తెలియడంతో అనిత పెద్దఎత్తున స్వాగత ద్వారాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో పసుపుమయం చేస్తుంటే పక్కనే ఉన్న నరీ ్సపట్నం నియోజకవర్గం చింతకాయల అయ్యన్నపాత్రుడు, చింతకాయల విజయ్‌లు భారీఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా బైరా ఫౌండేషన్ ఛైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి పెద్దఎత్తున స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాట్లు చేశారు. సోమమవారం రాత్రి నారా లోకేష్ బసచేసే పాయకరావుపేట మండలం నామవరం వైభవ్ లేఅవుట్ వద్ద స్వాగత ద్వారాలతో నింపేసారు. జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా అనిత నాయకత్వంలో ఒక పక్క పెద్దఎత్తున ఏర్పాట్లు చేయడంతో పాటు అనితమ్మ పాయకరావుపేట నియోజకవర్గంలో వలు గ్రామాల్లో నియోజకవర్గ పెద్దలు, ముఖ్యనాయకులు, మండల పాదయాత్ర ఇన్‌చార్జిలతో కలసి ఎన్నికల కోలాహలం లాగా పాదయాత్రలో పాల్గోనేందుకు ఆహ్వానాలు పలుకారు. బైరా ఫౌండేషన్ ఛైర్మన్ దిలీప్ చక్రవర్తి పాదయాత్రను జయప్రదం చేయాలని అనితమ్మ నాయకత్వంలో పెద్దఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర ్భంగా 12వ తేదీ మంగళవారం ఉదయం నామవరం - దేవవరం ప్రాంతంలో ప్రారంభమయ్యే పాదయాత్రకు ఉత్తరాంధ్ర పార్టీ ముఖ్యనేతలు స్వాగతం పలికేందుకు రానున్నారు. అనితమ్మ మాటా ్లడుతూ, యువగళం పాదయాత్ర 11వ తేదీ పాయకరావుపేట వద్ద అనకాపల్లి జిల్లాలో ప్రవేశిస్తుందని చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు వై జంక్షన్ వద్ద జాతీయ రహదారి వద్దకు చేరుకుంటారని, అక్కడ నుంచి పాదయాత్ర కొనసాగుతూ, సి.ఎల్.పురం, సీతారామపురం మీదుగా నామవరం చేరుకొని వైభవ్ లేఅవుట్ వద్ద ఆ రాత్రి లోకేషన్ అక్కడ బస చేస్తారని చెప్పారు.12 ఉదయం 8గంటలకు పాయకరావుపేట మండలం నామవరం వద్ద లోకేష్ పాదయాత్ర తిరిగి ప్రారంభమై, నక్కపల్లి మండలం దేవవరం జంక్షన్ వద్దకు చేరుకొని లోకేష్ అక్కడున్న బీసీ వర్గాలతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం అక్కడ నుంచి ప్రారంభమై ఒడ్డిమెట్ట, గొడిచర్ల, ఉద్దండుపురం, వేంపాడు మీదుగా చినదొడ్డిగల్లు మద్యాహ్నాంకు చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. అక్కడ నుంచి 3 గంటలకు అక్కడ నుంచి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి, చినదొడ్డిగల్లు, కాగిత, న్యాయంపూడి, వెదుర్లపాలెం, నక్కపల్లి జంక్షన్, ఉపమాక అగ్రహారం జంక్షన్ మీదుగా రాత్రికి కృష్ణ గోకులం వుడా లేఅవుట్‌కు చేరుకొని అక్కడ రాత్రి బసచేస్తారు. 13వ తేదీ ఉదయం లోకేష్ పాదయాత్ర తిరిగి 8 గంటలకు పాఠ్రంభమవుతుందని, సారిపల్లివానిపాలెం జాతీయ రహదారి మీదుగా ఎస్.రాయవరం మండలం కోనవానిపాలెం, తిమ్మాపురం అడ్డురోడ్డు, గోకులపాడు మీదుగా పెనుగొల్లు మద్యాహ్నానానికి చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం యలమంచిలి నియోజకవర్గ ంలోనికి లోకేషన్ పాదయాత్ర ప్రవేశిస్తుందని చెప్పారు. అనకాపల్లి జిల్లా విశాఖపట్నం జిల్లా పరిధి అయిన అగనంపూడి టోల్‌గేట్ వద్ద గతంలో చంద్రబాబు ఆవిష్కరించిన పైలాన్ వద్దకు చేరుకొని పాదయాత్ర 18 నాటికి ముగించ వచ్చునని తెలుస్తుంది. మూడురోజుల పాటు పాయకరావుపేట నియోజకవర్గంలో కొనసాగే ఈ పాదయాత్ర విజయవంతం కావాలని అనిత పిలుపునిచ్చారు. లోకేషన్ పాదయాత్రకు ఇటు టీడీపీ నాయకులతో పాటు అటు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడమే కాకుండా ఇరుపార్టీలు ఏర్పాటుచేసుకున్న ఫ్లెక్సీల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను భాగస్వామ్యం చేయడం విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 10 మందికి గాయాలు

### - స్పందించిన టిడిపి రాష్ట్ర నేత అనిత



నక్కపల్లి,డిసెంబర్10,ప్రభాతవార్త:

మండలంలోని ఉద్దండుపురం దేవవరం శివారు చినరామభద్రపురం జాతీయ రహదారులపై ఆదివారం మద్యాహ్నాం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 10మంది గాయపడ్డారు. చినరామభద్రపురం జంక్షన్ వద్ద ముగ్గురు యువకులు బైకుపై తునివైపు వెలుతుండగా, వెనుక నుంచి వస్తున్న మరో బైకు ఢీకొట్టడంతో ఇరుబైకులకు చెందిన గాయపడ్డారు. గాయపడిన వారిని అక్కడకు చేరుకొన్న హైవే పోలీసులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా అదుపు తప్పిన ఒక కారు ఉద్దండుపురం వద్ద ప్రయాణికులతో ఆగిఉన్న ఆటోను ఢీకొట్ట డంతో ఆరుగురు మహిళలు గాయపడ్డారు. ఆ సమయంలో అదే రహదారిలో వస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీరాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత స్పందించి పోలీసులకు సమాచారం అందించి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. ఎస్.ఐ ఎ. విభూషణరావు కేసునమోదు చేశారు.

## వైస్సార్సీపీ వాహన యాత్ర.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో రోడ్ షో



రాజవొమ్మంగి, డిసెంబరు 10, ప్రభాతవార్త

అల్లూరిజిల్లా రాజవొమ్మంగి మండలంలో ఈ నెల 14 16 తేదీల్లో నియోజకవర్గంలో మొట్టమొదటిగా వైస్సార్సీపీ వాహనయాత్ర కార్యక్రమం ప్రారంభమవుతున్నట్లు మండల వైస్సార్సీపీ కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, అడ్డతీగల జడ్పీటీసీ మద్దాల వీర్రాజులు పాత్రికేయులకు తెలిపారు. వాహనయాత్ర పోస్టల్ ఆవిష్కరణ కార్యక్రమం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో జరిగింది. 14, 16 తేదీల్లో జరిగే ఈ యాత్రలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ్ భాస్కర్, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని, నాలుగేళ్ల జరిగిన పాలన పై వివరిస్తూ ప్రజాసమస్యలు తెలుసు కొంటారని వైస్సార్సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్ రాజు అన్నారు. కార్యక్రమ వివరాలను వెంకటేష్ రాజు వివరించారు. 14వ తేదీ గురువారం వైయస్సార్ వాహన (యాత్ర రోడ్ షో కార్యక్రమంలో వట్టిగడ్డ, రాజవొమ్మంగి, శరభవరం, కింద్ర కింద్ర, లబ్బర్తితో యాత్ర ముగుస్తుందని అన్నారు. 16వ తేదీ శనివారం వైయస్సార్ వాహన యాత్ర (రోడ్ షో) కార్యక్రమం లో బలిజపాడు వంచంగి, కరుదేవపాలెం, చికిలింత, కొమరాపురం, అమీనాబాద్ గ్రామం మీదుగా జడ్డంగి సాయంత్రం 5.30 గంటలతో యాత్ర ముగుస్తుందని వెల్లడించారు. వాహన యాత్ర (రోడ్ షో కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కన్వీనర్ రామకృష్ణ కోరుతున్నారు. సింగిరెడ్డి రామకృష్ణ, దాట్ల వెంకటేష్ రాజు, కొంగర మురళీ కృష్ణ, అడపా కామేశ్వరరావు, చీడి శివ బూసరి సత్యనారాయణ కనిగిరి గంగ దుర్గ, బొడ్డు వెంకటరమణ, నాగులపల్లి కుశరాజు, అధికారి సత్యనారాయణ, ముసలయ్య, కనిగిరి రాజబాబు, అంకం రవి, చీడిపల్లి శాంతకుమారి, పల్లి వెంకటరమణ, చింతలపూడి వెంకటరమణ, బంటుపల్లి చంద్రరావు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## 25నుంచి ఇంటింటికి అయోధ్య శ్రీరాముని అక్షింతలు



ఇచ్ఛాపురం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

ఈనెల 25 నుంచి 28 వరకు ఇంటింటికి అయోధ్య శ్రీరాముని పవిత్ర అక్షింతలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాంప్రసాద్ చెప్పారు. ఈ మేరకు గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి 22న రామమందిరం ప్రతిష్ఠ నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి ఇంటికి అక్షింతలు చేరవేయడం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. మున్సిపాలిటీ మండలం పరిధిలో జనవరి 15లోగా అక్షింతలు చేరేందుకు కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమం పాక తులసీదాస్, జయకృష్ణ, లోపింటి సత్యం, టెంక లోకేష్, ధనుష్ రంగా, శ్రీను, దుర్యోధనరెడ్డి పాల్గొన్నారు.

## మానవహక్కులపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరం

ఇచ్ఛాపురం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మానవహక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మహిళ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్య అన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా శాంతినికేతన్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో నియోజకవర్గ అధ్యక్షులు దక్కత కృష్ణమూర్తిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజేంద్ర, కె.రామారావు, ఎం.రాంబాబు, కె.సిపూరి, తులసీరావు, తదితరులు పాల్గొన్నారు.

## శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి

రణస్థలం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

ఆర్థికంగా మెకబడిన శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలని రణస్థలం, లావేరు మండలాల శిష్టకరణ సంఘం గౌరవ సలహాదారు బలివాడ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రణస్థలం, లావేరు మండలాల శిష్టకరణ కార్తీకసమారాధన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరణాలను బీసీలో చేర్చినా కేంద్ర సర్వీస్‌లకు వచ్చేసరికి ఓబీసీ అనివార్యమౌతుందన్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

**నూతన కమిటీ ఏర్పాటు...**

రణస్థలం, లావేరు మండలాల శిష్టకరణాల నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికైంది. గౌరవ అధ్యక్షులుగా రొంపిల్లి నాగరాజు, అధ్యక్షులు ఆర్వి రమణ, ఉపాధ్యక్షులు బలివాడ ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కొట్టు శాంతారావు, ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి జగదీష్‌పాత్రో, ట్రెజరేర్‌గా బలివాడ బద్రి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## నేడు మంత్రి విడదల రజని పలాస పర్యటన

శ్రీకాకుళం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన వివరాలను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాట్కర్ ఆదివారం సాయంత్రం వెల్లడించారు. ఆదివారం సాయంత్రం ఆమె విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గం ద్వారా పలాసలోని పవర్‌గ్రిడ్ వసతి గృహానికి చేరుకుని రాత్రి బస చేస్తారు. సోమవారం ఉదయం 9గం.కు ఆమె పలాసలోని వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆసుపత్రిని సందర్శిస్తారు. ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించిన అనంతరం అక్కడే విలేకర్లసమావేశంలో మాట్లాడుతారని, పర్యటన అనంతరం ఉదయం 10 గంటలకు ఆమె విశాఖపట్నం తిరిగి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

## జీడి రైతులకు అండగా తాతారావు



సోంపేట, డిసెంబర్ 10, ప్రభాతవార్త

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత జీడి రైతులు గత నాలుగేళ్లుగా జీడిపిక్క మద్ధతుధర లేక పడుతున్న కష్టాలు గురించి శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడు ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించడాన్ని జేటీఆర్ యువసేన స్వాగతించింది. పలాస నియోజకవర్గంలో పాలకుల నిర్లక్ష్యం ప్రతిపక్షం పోరాటం చేయకపోవడం వల్లే ఈ సమస్య ఏర్పడిందని జేటీఆర్ యువసేన పేర్కొన్నారు. ఈ సమస్యపై గత రెండేళ్లుగా సామాజిక వేత్త, మాజీ గ్రూప్ 1 అధికారి జుత్తు తాతారావు, రైతులు పడుతున్న ఆవేదన చూసి కారణాలు విశ్లేషించుకుని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం కూడా ఇవ్వడం జరిగింది. మన ఉద్దానం ప్రాంతంలో జీడి పిక్కకు మద్ధతు ధర రాకపోవడానికి ప్రధాన కారణం విదేశీ జీడిపిక్క ఇంపోర్ట్ డ్యూటీ 2.5 శాతంకి కుదించమని అదే కంపెనీ జీడిపప్పుని విదేశాలకు ఎగుమతి చేస్తే ఇంపోర్ట్ డ్యూటీ మరియు ఎక్స్‌పోర్ట్ డ్యూటీ రెండూ ఫ్రీ చేయడం వల్ల విదేశాల నుంచి సరఫరా పెరిగి మన స్థానిక జీడిపిక్కకి డిమాండ్ తగ్గడంతో మన రైతులు పండించిన జీడిపక్కికి మద్ధతుధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు. ఉద్దానం జీడిపిక్క మద్ధతుధర పెరగాలి అంటే విదేశీ జీడిపిక్క దిగుమతి సుంకాన్ని 2.5 శాతం నుంచి 10శాతం పెంచడం, టీటీడీ, విజయవాడ కనకదుర్గ వంటి పుణ్యక్షేత్రాలకు కావల్సిన జీడిపప్పు టెండర్లల్లో పలాస జీడిపప్పుకి ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జీడి రైతుల పక్షాన పోరాటంలో జేటీఆర్ మరియు జేటీఆర్ యువసేన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని రైతులకి తెలిపారు.

## గరికపాడు పంచాయితీలో భవిష్యత్ గ్యారంటీ



సంతకవిటి, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మండలంలో గరికపాడు పంచాయతీలో ఆదివారం భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ వినతిపత్రాలను అందజేయడం జరిగింది. రాష్ట్రంలో అభివ/ద్ధి జరగాలంటే మళ్లీ చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పడం జరిగింది. నిత్యావసర సరుకులు ధరలు నిత్యావసర సరుకులు ధరలు బాగా పెరిగాయని విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీసాల ఈశ్వరరావు, దుర్గాశి ఆనందరావు, మీసాల సాయిప్రతాప్, వావిలపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభ స్థల పరిశీలన



పాతపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

ఈ నెల 13వ తేదీన పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో చేపట్టనున్న సామాజిక సాధికార యాత్ర బహిరంగ సమావేశ నిర్వహణకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి డిఎస్పీ బాలచంద్రారెడ్డితో కలిసి పాతపట్నం పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థల పరిశీలన చేశారు. వీరితో పాటు పాతపట్నం, కొత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఎం.వినోద్‌బాబు, ఆర్.వేణుగోపాల్, పాతపట్నం, మెళియాపుట్టి సబ్ ఇన్స్పెక్టర్లు మహమ్మద్ యాసిన్, టి.రాజేష్‌లతో పాటు పాతపట్నం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## పలాస నియోజకవర్గ అగ్రిగోల్డ్ బాధితులు సత్యాగ్రహ దీక్షలు

### పేదల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్య దొంగల్ని శిక్షించండి



కాశీబుగ్గ, డిసెంబర్ 10, ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా దీక్షల్లో భాగంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పలాస సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్ ప్రారంభించారు. ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.జయసింహా, రాష్ట్ర మహిళా కార్యదర్శి అరుణమ్మ మాట్లాడుతూ పిల్లల చదువులకు ఉపయోగపడతాయని కొందరు, ఇంట్లో ఆడబిడ్డ పెళ్లికి సాయపడతాయని మరికొందరు, అనారోగ్య పరిస్థితుల్లో ఆదుకుంటాయని ఇంకొందరు, అదనపు వడ్డీ వస్తుందనే ఆశతో లక్షలాది మంది [illegible]

## ప్రతి ధాన్యం గింజను కొనాల్సిందే...!

### ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆదేశం



వీరఘట్టం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మండలంలో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొని తీరాల్సిందేనని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రైతులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ప్రతి ఒక్క ధాన్యం గింజను కొనుగోలు చేసి తీరాలని ఆయన అన్నారు. ఇందుకోసం రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్త కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. పార్టీలకు అతీతంగా రైతన్నకు అండగా నిలబడి ప్రభుత్వానికి చెడ్డ పేరు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి జె.మాధవి మాట్లాడుతూ ఇటీవల సంబంధించిన తుపాన్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 400 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ఆమె వివరించారు. అయితే రానున్న రోజుల్లో ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఆమె వెల్లడించారు. మండలంలో జిపిఎస్ కలిగిన 45 వాహనాలు ఉన్నాయని వీటి ద్వారా ధాన్యం రవాణా జరుగుతుందని ఆమె తెలిపారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వీలుగా ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామని ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణనాయుడు కలుగ చేసుకుంటూ మీరు చేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియజేయాలని ఆయన చెబుతూ సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి సంబంధిత రైస్ మిల్లులకు పంపించాలని ఆయన ఆదేశించారు. అంతేకాకుండా దళారులను ఆశ్రయించకుండా నేరుగా అధికారులే ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి రైతులకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ కుమారస్వామి మాట్లాడుతూ వీరఘట్టం మండలంలో 41 రెవెన్యూ గ్రామాలకు గాను 22 గ్రామాల్లో భూసర్వే పూర్తయ్యిందని అన్నారు. మరో 10 గ్రామాల్లో భూసర్వే వివిధ దశల్లో ఉండగా, ఇంకా ఐదు గ్రామాల్లో భూసర్వేను ప్రారంభించవల్సి ఉందని అన్నారు. ఈ భూసర్వేలో ఏమైనా తప్పులు ఉంటే తహశీల్దార్ దృష్టికి తీసుకు వస్తే సవరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వి. రమణ, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు విశ్వాసరాయి భార్గవ్, పర్రి విజయ కుమారి, ఉద్యాన శాఖ అధికారి అమరేశ్వరి, వ్యవసాయాధికారి జె.సౌజన్య, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖరరావు, సలహా మండల అధ్యక్షులు కర్రి లీలాప్రసాదరావు, సలహా మండల అధ్యక్షులు కర్రి లీలాప్రసాదరావుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణులకు అండగా ఉండేందుకే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు

### బ్రాహ్మణ వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం



ఆముదాలవలస, డిసెంబర్ 10, ప్రభాతవార్త

సమాజం సంతోషంగా, శాంతియుతంగా ఉన్నప్పుడే సమాజ పురోగమనం, శ్రేయస్సు అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. పౌర సమాజం సంతోషంగా ఉండాలంటే సమాజంలో వివిధ వర్గాలు సంతోషంగా ఉండాలన్నారు. ఇదే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తుందన్నారు. బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఆదివారం పట్టణంలో వేద గాయత్రి బ్రాహ్మణ మండల సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన భోజన కార్యక్రమంలో సభాపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ్ అంటే ఆలోచనలో విశాలమైన, తెలివైన జీవనోపాధిలో నీతి, మతం, వ్యక్తిత్వంలో చమత్కారం, సాహసం, నాణ్యతలో నిజాయితీ, మానవత్వం, పాత్రలో నమ్రత, నైతికత, పనితీరులో ఆవిష్కరణ, పరిశ్రమ, అభిరుచిలో కొత్తదనం వంటివి అంతర్భాగంగా నిలుస్తాయన్నారు. బ్రాహ్మణ విద్యార్థి, యువత, పురోహితులు, మహిళలు సంక్షేమం కోసం కార్పోరేషన్ ద్వారా చిత్తశుద్ధితో సేవలు అందించడం జరుగుతుందన్నారు. సీనియర్ సిటిజన్స్ మేలు జరిగేలా పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. బ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా నిలిచేందుకే బ్రాహ్మణ కార్పోరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్పోరేషన్ ద్వారా బ్రాహ్మణులకు ప్రభుత్వంలో పార్టీలో రాజకీయ ప్రాధాన్యత కల్పించిందన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో బ్రాహ్మణ యువత ముందు వరుసలో నిలవాలని స్పీకర్ ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ఉన్న బ్రాహ్మణ కుల అభివృద్ధిలో ముఖ్య భాగస్వామిగా నిలుస్తానన్నారు. శ్రీవేద గాయత్రి బ్రాహ్మణ సంఘానికి కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని కేటాయించమని త్వరలో కమ్యూనిటీ హాల్ కూడా కట్టించి ఇస్తామని ఆయన అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనలో స్వల్ప మార్పు

### ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి



కాశీబుగ్గ, డిసెంబర్ 10, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలాస నియోజకవర్గానికి ఈ నెల 15వ తేదీ గురువారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి పలాస రావల్సి ఉన్నప్పటికీ అధికార కార్యక్రమంలో స్వల్ప మార్పు జరిగింది. 15 కాకుండా 14న పలాస వస్తున్నారు. కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్‌లో జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలాస నియోజకవర్గానికి ఈ నెల 15వ తేదీ గురువారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అనంతరం కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్‌లో జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని వైసీపీ పార్టీ కార్యకర్తలను నాయకులను ప్రజలు మరియు సాభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

## కొరసవాడ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన నల్లి రాజారావు

పాతపట్నం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

పోలీస్ శాఖ నిర్వహిస్తున్న చిన్నారికి చేదోడు కార్యక్రమంలో భాగంగా పాతపట్నం మండల సామాజిక సేవా కార్యకర్త నల్లి రాజారావు ఆదివారం పాతపట్నం మండలంలోని కొరసవాడలో ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ముందుగా అక్కడ విద్యార్థులతో పరిచయం చేసుకున్నారు. విద్యార్థులకు బాసటగా నిలవడానికి మేమున్నామని వారికి వివరించారు. మీకు ఉన్న సమస్యల గురించి నాతో చెప్పాలని విద్యార్థులను కోరారు. మీకు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రత, అభ్యసన ప్రక్రియలకు సంబంధించిన పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనాలు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలీస్‌శాఖ పిలుపు మేరకు ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు, అనాథాశ్రమాలు సందర్శించి అక్కడి విద్యార్థులతో మమేకమై వారి శక్తి సామర్థ్యాలను పెంచేలా కృషి చేస్తామన్నారు. వారానికి ఒకరోజు వారితో మమేకమై నాయకత్వ లక్షణాలు, చదువుపై ఆసక్తి పెంచేలా చూడడం, చిన్నారికి చేదోడు కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. ఆయనతో పాటు పాతపట్నం పోలీస్‌సిబ్బంది, జీవరత్నం, పాఠశాల ప్రిన్సిపాల్ గణపతి, శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ



కోటబొమ్మాళి, డిసెంబర్ 10, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ అని టెక్కలి శాసనసభ్యుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం మండలం లోని కిష్టుపురం గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ పొలిమేరల్లోనే పెద్దఎత్తున తెలుగుదేశం కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు, గ్రామ ప్రజలు, నాయకులు పెద్దఎత్తున చేరుకుని మేళతాళాలతో గ్రామంలోకి వందలాది మందిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేయబోయే మేనిఫెస్టోలోని పథకాలు గురించి వివరించారు. ఈమేరకు ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500రూపాయలు, తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి ఇంట ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికి ఏడాదికి 15వేల రూపాయలు జమ చేస్తామన్నారు. దీపం పథకం ద్వారా కుటుంబానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటి సౌకర్యం, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం, బిసిలకు రక్షణచట్టం తెచ్చి అన్ని విధాలా వారికి అండగా నిలుస్తామన్నారు. యువగళం నిధి కింద నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3వేల రూపాయలు అందివ్వడం జరుగుతుందన్నారు. పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలకు సంపన్నులుగా మార్చే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామంలో పర్యటిస్తుంటే ప్రజలు తండోపతండాలుగా వచ్చి పూల దండలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్, టెక్కలి నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు పూజారి శైలజ సత్యన్నారాయణ, సంతబొమ్మాళి మాజీ జెడ్పీటీసీ బాడాన రమణమ్మ, మాజీ సర్పంచ్‌లు గుండ లక్ష్మణరావు, దేవాది సింహాద్రి, ఎంపీటీసీ ప్రతినిధి పట్ట సింహాచలం, మాజీ ఎంపీటీసీ బాడాన చిన్నవాడు, ముచ్చురాజు, టిఎన్‌టియుసి టెక్కలి నియోజకవర్గం అధ్యక్షులు జి.నర్సింగరావు, నాళ్ల ఆదినారాయణ (చిన్ని)తో పాటు సంతబొమ్మాళి, టెక్కలి మండలాలకు చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నవారిలో ఉన్నారు.

శ్రీకాకుళం వార్త 25



## బీఎస్ఎఫ్ జవాను మృతి



కోటబొమ్మాళి, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దుబ్బ రామారావు (36) కిడ్నీ సమస్యతో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిబిహెచ్ జనరల్ ఆసుపత్రిలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం రాజస్థాన్ ఉదయ్‌పూర్ 162 బెటాలియన్‌లో పని చేస్తున్నాడని గత కొంత కాలంగా కిడ్నీ సమస్య ఉన్నట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. కడుపునొప్పితో బాధ పడుతున్న రామారావుకు ఆసుపత్రికి తీసుకు వచ్చారు. పరీక్షించిన వైద్యులు కిడ్నీ పని చేయడం లేదని డయాలసిస్ చేయాలని తెల్పగా అందుకు భార్య చికిత్స చేయమని కోరారు. చికిత్స చేస్తుండగా ఆదివారం ఉదయం మృతి చెందారు. మృతుని తండ్రి కరువయ్య, తల్లి లచ్చుమ్మలు స్వగ్రామంలో ఉన్నారు. భార్య దివ్యభారతి, కుమార్తెలు లేఖ్య, హర్షిణిశ్రీలు ఉన్నారు. మృతదేహం సోమవారం గ్రామానికి చేరవచ్చునని బిఎస్ఎఫ్ వర్గాలు తెలిపాయి. వాయుమార్గంలో భువనేశ్వర్ వరకు వస్తుందని అక్కడ నుంచి రోడ్డు మార్గంలో మృతదేహం రావడం జరుగుతుందని తెలిపారు. మరణవార్త విన్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



కోటబొమ్మాళి, డిసెంబర్ 10, ప్రభాతవార్త

పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంజిఎన్ఆర్‌జిఎస్ జెఈ జి.హరి ప్రసాద్ కోరారు. వికసిత్ భారత్ సంకల్పన యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కురుడు, నారాయణవలస పంచాయతీల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులను పంపిణీ చేశారు. 2024 కేలండర్‌ను ఆవిష్కరించారు. అర్హులకు ఉజ్వల యోజన కార్యక్రమం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మెట్ట తిరుమలరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది డాక్టర్ వైఎస్సార్ క్రాంతిపదం సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కటౌట్ ఏర్పాటు

సారవకోట, డిసెంబర్ 10, ప్రభాతవార్త

సారవకోట మండలంలో నౌతల జంక్షన్ బొంతు జంక్షన్ వద్ద రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షుడు ధర్మాన తేజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కటౌట్‌లు ఏర్పాటు చేయడమైనది. స్థానిక పార్టీ నాయకులు పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, దేవరాజు, జయరాం, శిమ్మ రామకృష్ణ, శర్వాన రామకృష్ణ, ముఖలింగం, తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా పలువురికి కంటి వైద్య సేవలు

సారవకోట, డిసెంబర్ 10, ప్రభాతవార్త

అవలంగి గ్రామ జేబీటీ పాఠశాల యజమాని పి.మోహన్‌గాంధీ ఉచితంగా పలువురికి కంటి సమస్య రోగులకు కంటి వైద్యులు కుమారస్వామి, రవళి స్వామి కంటి ఆసుపత్రి నుంచి తెప్పించి కంటి పరీక్షలు, వైద్య సేవలు చేయించారు. పలువురు రోగులు హాజరయ్యారు. భోజన సౌకర్యాలు అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. శస్త్ర చికిత్సలు నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## ఘనంగా అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమం



గుమ్మలక్ష్మీపురం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మండల కేంద్రమైన భద్రగిరి శ్రీ రామలింగేశ్వర ఆలయ సన్నిధిలో అయ్యప్ప దీక్ష పూర్తి చేసిన సమారు 80 మంది అయ్యప్ప స్మాఉలకు ఆదివారం ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం గురువస్వామి పోలూరు శ్రీనివాసరావు సౌజన్యంతో బత్తిలి గ్రామానికి చెందిన నరంప తాతబాబు గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములకు చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తాతబాబు గురుస్వామి మంత్రోచ్చారణల మధ్య స్వాముల శరణుగోషతో ఆలయ ప్రాంగణం అంతా మార్మోగింది. స్వాముల ఇరుముడి కార్యక్రమం అనంతరం కాలిబాటన ఎల్విన్ పేట గ్రామ దేవత ఆయన శ్రీ నీలమ్మ తల్లి ఆలయానికి అయ్యప్ప భక్తులు చేరుకుని అమ్మవారి దర్శనానంతరం రెండు ప్రైవేటు బస్సులతో శబరిమలైకు పయనమయ్యారు. ఈ విషయంలో అయ్యప్పస్వాములకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు ఘనంగా సాగనంపారు.

## ఐదువేల మందికి అన్న సమారాధన



గుమ్మలక్ష్మీపురం, డిసెంబర్ 10, ప్రభాతవార్త

మండల కేంద్రమైన భద్రిగిర శ్రీ రామలింగేశ్వర దేవాలయ సన్నిధిలో అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం సందర్భంగా ఆదివారం ఆ ఆలయ ప్రాంగణంలో సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం పాలూరు శ్రీనివాసరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష చేసిన సుమారు 80 మందికి అయ్యప్ప భక్తుల ఇరుముడి కార్యక్రమానికి హాజరైన వారి కుటుంబ సభ్యులకు బంధు మిత్రులకు ఆయన తాగునీరు, ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఇలాంటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీనివాసరావు గురుస్వామికి అయ్యప్ప భక్తులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు అబినందనలు వ్యక్తం చేశారు.

## వైసీపీ ప్రముఖుల పరామర్శల పర్వం



నెల్లిమర్ల, డిసెంబర్ 10, ప్రభాతవార్త

వైసిపి జిల్లా నాయకులు నెల్లిమర్ల మండలంలో సుడిగాలి పర్యటన చేసి పరామర్శల పర్వం కొనసాగించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేటలోని రాష్రనగావంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు తండ్రి మద్దిల ముత్యాల నాయుడు (గార్నాయుడు) ఇటీవల మరణించిన దష్ట్యా ఆయన కుటుంబీకులను పరామర్శ చేశారు. అలాగే అదే గ్రామంలోని మరో నేత ఇటీవల మరణించిన మద్దిల శ్రీనివాసరావు కుటుంబీకులను కూడా పరామర్శించి తనప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజాం ఎంఎల్ఎ కంబాల జోగులు తదితరులు ఉన్నారు. అలాగే వైసిపి నియోజక వర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు కూడా వేరుగా ముత్యాల నాయుడు ఇంటికి వచ్చి ఆయన కుమారుడు వాసును, కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంఎల్ఎ బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంఎల్‌సి డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) నెల్లిమర్ల లోని వైసిపి నాయకుడు చిక్కాల సాంబశివరావు నపరామర్శ చేశారు. సాంబశివరావు తల్లి అప్పయ్యమ్మ ఇటీవల మరణించిన దరిమిలా శనివారం వీరిద్దరూ ఆయన ఇంటికి వెళ్లి అప్పయ్యమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ వైసిపి పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠంనాయుడు, నగర పంచాయితీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కష్ణారావు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెకక్టర్ రేగాన శ్రీనివాసరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, రాష్ట్ర ఆర్‌అండ్‌బి కార్పొరేషన్ డైరెక్టర్ నౌపడ శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, తదితరులు ఉన్నారు.ఎంఎల్‌సి డాక్టర్ సురేష్‌బాబు జరజాపుపేటలో పర్యటించి ఇటీవల మరణించిన మద్దిల గార్నాయుడు, మద్దిల శ్రీనివాసరావు, బూడి సత్యనారాయణల ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాల వారిని పరామర్శ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగర పంచాయితీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతో పాటు రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు,వైసిపి నాయకులు నల్లి శ్రీను, శివ, తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, తుమ్ము వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే తంగుడుబిల్లి వెళ్లి ఇటీవల మరణించిన మాజీ సర్పంచ్ పాలూరి రాజినాయుడు కుటుంబీకులను కూడా ఎంఎల్‌సి డాక్టర్ సురేష్‌బాబు పరామర్శ చేశారు. రాజినాయుడు కుమారుడు తిరుపతిరావుతో మాట్లాడారు. మనోధైర్యంతో ఉండాలని ఆయన సూచించారు.

## అచ్చెన్నాయుడును కలిసిన టీడీపీ నేత రవిశేఖర్



నెల్లిమర్ల, డిసెంబర్ 10, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, నెల్లిమర్ల నియోజక వర్గ పోల్‌మేనేజ్‌మెంటు కోఆర్డినేటర్ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును ఆయ స్వగ్రామం నిమ్మాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు దుశ్శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించిన అనంతరం ఆయనతో ముఖాముఖిగా పార్టీ విషయాలను చర్చించారు. రానున్న ఎన్నికలకు సంబంధించి నెల్లిమర్ల, ఇచ్ఛాపురం నియోజక వర్గాల పరిస్థితిని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతినాయకుడు పనిచేయాలని రవిశేఖర్‌కు అచ్చెన్నాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు పంచాది జగన్నాథం, లెంక సన్యాసిరావు,పైడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.